కలెక్టర్ శివశంకర్ పిటిషన్ కొట్టివేత



ఈనాడు, దిల్లీ, ఈనాడు, కడప: ప్రస్తుతం ఏపీ కేడర్‌లో పనిచేస్తున్న తనను తెలంగాణ కేడర్‌కు కేటాయిస్తూ డీవోపీటీ జారీ చేసిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ కలెక్టర్ లోతేటి శివశంకర్ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టేసింది. ఈ మేరకు జస్టిస్ హృషికేశ్ రాయ్, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టిలతో కూడిన ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. కేసు ఇంకా క్యాట్‌లో పెండింగ్‌లో ఉందని, అది జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులను సవాల్ చేస్తూ దాఖలు చేసిన కేసులో తాము ప్రస్తుత దశలో జోక్యం చేసుకోలేమని ధర్మాసనం పేర్కొంది. కేసును సాధ్యమైనంత త్వరగా విచారించి తుది తీర్పు వెలువరించమని కోరుతూ క్యాట్‌నే ఆశ్రయించాలని పిటిషనర్‌కు సూచించింది. ఇందులో హైకోర్టు, సుప్రీంకోర్టులు వ్యక్తం చేసిన అభిప్రాయాల ప్రభావానికి లోనుకాకుండా మెరిట్స్ ఆధారంగా క్యాట్ ఈ కేసును విచారించి నిర్ణయం వెలువరించాలని నిర్దేశించింది. మరో పక్క శివశంకర్ పరిణామాల నేపథ్యంలో కడప తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డిలు ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని కలిసి శివశంకర్ ప్రయత్నాలు తేలే వరకు కొత్త కలెక్టర్ నియామకం విషయం వేచి చూడాలని విజ్ఞప్తి చేశారు. దీంతో నియామకం ఆగింది. ఇతరత్రా ప్రయత్నాలు సఫలం కాని పక్షంలో కొత్త కలెక్టర్ నియామకం అనివార్యం కానుంది.

విద్యార్థిని కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందజేత నేడు

ఈనాడు, కడప: బద్వేలులో హత్యకు గురైన ఇంటర్మీడియట్ విద్యార్థిని కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం బుధవారం అందజేయనుంది. ప్రేమోన్మాది విఘ్నేష్ హతమార్చిన ఘటనలో బలైన విద్యార్థిని కుటుంబాన్ని ఆదుకోవడంలో భాగంగా సాయాన్ని అందిస్తోంది. ఈ మేరకు ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితిసింగ్, తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి, పార్టీ బద్వేలు సమన్వయకర్త రితీష్‌రెడ్డి, ఆర్డీవో చంద్రమోహన్ కలిసి అందజేయనున్నారు. ఇప్పటికే ఘటనపై సీఎం చంద్రబాబునాయుడు ప్రత్యేకంగా సమీక్షించడంతో పాటు నిందితుడిని గంటల వ్యవధిలో పట్టుకోగలిగారు. చికిత్స పరంగా విశ్వ ప్రయత్నాలు చేసినప్పటికీ 80 శాతం కాలిన గాయాలతో విద్యార్థిని ప్రాణాలు కోల్పోయింది.

విదల్చని బిల్లులు... మిగిల్చిన బాధలు!

- రూ.27 కోట్లకుపైగా విద్యుత్తు బిల్లు బకాయిలు
- గుత్తేదారులకు నిలిచిపోయిన రూ.కోట్ల చెల్లింపులు
- ఇదీ పులివెందుల పట్టణంలోని దయనీయ పరిస్థితి



పులివెందులలో అసంపూర్తిగా నిలిచిన రక్షిత తాగునీటి పథకం నిర్మాణం

–ఈనాడు, కడప

అభివృద్ధికి నిలువెత్తు నిదర్శనంగా తీర్చిదిద్దిన పులివెందుల పట్టణం రాష్ట్రానికే ఆదర్శమని పలుమార్లు వైకాపా అధినేత జగన్ ముఖ్యమంత్రి హోదాలో ఊదరగొట్టారు. జూన్ 4న ఓట్ల లెక్కింపు సమయానికి అప్పటి వైకాపా ప్రభుత్వం పులివెందుల ప్రాంత అభివృద్ధి సంస్థ (పాడా) కింద రూ.700 కోట్లకుపైగా బిల్లుల బకాయిలు పెట్టింది. ఆపై పురపాలక సంఘం రూ.27 కోట్లకుపైగా విద్యుత్తుబిల్లులు చెల్లించకుండా ఎస్పీడీసీఎల్‌కు అప్పుపడింది. ఇదే సమయంలో పురపాలక సంఘం విద్యుత్తు బిల్లులు కట్టలేమని వీధిదీపాలు నిలిపేయడంతో గత మూడు నెలలుగా అంధకారం అలముకుంది. మరోపక్క తమ నాయకులకు కాంట్రాక్టులు కట్టబెట్టి ఇబ్బడిముబ్బడిగా పనులు చేపట్టి బిల్లులు చెల్లించకుండా చేతులెత్తేయడంపై గుత్తేదారులు ఆందోళన చెందుతున్నారు. కొందరైతే బిల్లుల కోసం న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీనిపై వైకాపా అధినేత జగన్‌ను పులివెందుల నాయకులు గట్టిగానే నిలదీశారు. పాడా కింద పులివెందుల మోడల్ టౌన్ పేరిట రూ.651 కోట్ల పనులకు రూ.378 కోట్ల విలువైన పనులు పూర్తి చేయగా, వివిధ దశల్లో రూ.211 కోట్ల విలువైన పనులు పెండింగ్‌లో ఉన్నాయి. రెండో విభాగంగా పాడాను గుర్తించి గత అయిదేళ్లగా 591 పనులు చేపట్టి రూ.333 కోట్ల విలువైన పనులు చేపట్టగా, అవన్నీ అసంపూర్తిగానే ఉన్నాయి. పులివెందుల, వేంపల్లెలో చాలా వరకు పెండింగ్ పనులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాడా కాకుండా ఇతరత్రా శాఖల కింద దాదాపు రూ.1,000 కోట్ల బిల్లులు పేరుకుపోయినట్లు సమాచారం. ఇలాంటి పరిస్థితుల్లో వీధిదీపాలు, రహదారులు, ఉద్యానవనాల నిర్వహణ సమస్యగా మారింది. విద్యుత్తు బిల్లుల బకాయిలు, వీధిదీపాల నిర్వహణపై చేతులెత్తేసిన వ్యవహారంపై ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి మంగళవారం సమీక్ష నిర్వహించడంతో వెలుగులోకి వచ్చింది.



పులివెందులలో నిర్మాణం ఆగిపోయిన భారీ దుకాణ సముదాయం

ప్రస్తావించాలి... పరిష్కరించాలి!

- రైతులకు చేయూతనివ్వాలి
- అధ్వానంగా వసతిగృహాలు
- రహదారులదీ అదే పరిస్థితి
- నేడు జడ్పీ సర్వసభ్య సమావేశం



ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న వరి పంట

–ఈనాడు, కడప

ఎంతో కీలకమైన జిల్లా పరిషత్తు సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం పది గంటలకు ప్రారంభం కానుంది. సమావేశంలో ఉమ్మడి కడప జిల్లాలోని సమస్యలపై చర్చించడంతో పాటు పరిష్కారానికి చర్యలు చేపట్టాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉంది. అవసరమైన అంశాలను రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించి ఆదుకునే దిశగా ప్రయత్నాలు జరగాలి. ప్రత్యేకించి వ్యవసాయ రంగం కుదేలైపోయింది. రైతులు ఆర్థికంగా నష్టాలపాలయ్యారు. రబీకి సన్నద్ధం చేసే దిశగా ముందు జాగ్రత్తలు తీసుకోవాలి. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో రహదారులు అధ్వానంగా మారాయి. వీటి మరమ్మతులు వేగవంతం చేయాల్సి ఉంది. విద్య, వైద్య, పశు వైద్య రంగాలపై విస్తృతంగా చర్చ జరగాలి. వసతిగృహాల్లో అక్రమాలు, అవినీతికి హద్దులు లేకుండా పోయింది. ప్రత్యేకించి వెనుకబడిన తరగతుల విభాగంలో విద్యార్థుల సంఖ్యను బట్టి నెలవారీ వసూళ్లకు పాల్పడుతున్నారు.

- ఖరీఫ్‌లో వర్షాభావంతో ఉమ్మడి కడప జిల్లాలో 7 వేల ఎకరాల్లో పంటలు ఎండిపోగా, ఇటీవల కురిసిన భారీ వర్షాలకు 3 వేల ఎకరాల్లో నష్టం వాటిల్లింది. ప్రధానంగా వరి పంటతో పాటు ఉద్యానతోటలు దెబ్బతిన్నాయి. బాధిత రైతులకు ఆర్థికసాయం అందించే దిశగా చర్యలు చేపట్టాల్సి ఉంది. చాలా చోట్ల చీనీ మొక్కలు తెగుళ్లతో ఎండిపోతున్నాయి. వీటికి పరిష్కారం చూపడంలేదు. రబీ సీజన్‌కు జల వనరులు పుష్కలంగా అందుబాటులోకి వచ్చాయి. అవసరమైన విత్తనాలు, ఎరువులు, రుణాలు అందించే దిశగా చర్యలు చేపట్టాలి. ఈ మేరకు అర్థవంతమైన చర్చ ద్వారా రైతాంగాన్ని అందుకునే దిశగా... సాయం అందే విధంగా తగు విధంగా సన్నద్ధం చేయాల్సి ఉంది. తాగునీటి పథకాలైన సీపీడబ్ల్యూ పేరిట ఉన్నవి చాలా వరకు నిర్వహణ లోపంతో ఉన్నాయి. కొందరు ఇంజినీరింగ్ అధికారులు, గుత్తేదారులు కుమ్మక్కై అవినీతి, అక్రమాలకు పాల్పడడంతో వ్యవస్థ నాశనమైపోయింది. వీటిని బాగు చేసి ప్రజానీకానికి సురక్షితమైన నీరందించాల్సి ఉంది.
- ఉమ్మడి కడప జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రహదారులు మరింతగా దెబ్బతిన్నాయి. వీటిని మరమ్మతులు చేయాల్సి ఉంది. జాతీయ రహదారుల నిర్వహణ అధ్వానంగా తయారైంది. టోల్ వసూలు చేస్తున్నప్పటికీ రహదారులు దయనీయస్థితిలో ఉన్నాయి. పర్యవేక్షణ లోపంతో గుత్తేదారులు వాహనదారుల నుంచి దోచుకుంటున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు అందిస్తున్నందున రహదారుల మరమ్మతులకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాల్సి ఉంది.
- విద్య, వైద్య, పశువైద్యరంగాల పనితీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రత్యేకించి వైద్య సేవలు, సిబ్బంది సమయపాలన పట్టించుకోవడంలేదు. పశువైద్యశాలల్లో మందుల కొరత వెంటాడుతోంది. వసతి గృహాల ప్రక్షాళన జరగలేదు. గతంలో ఉన్న అధికారులే పాలన సాగిస్తుడడంతో అవినీతి, అక్రమాలు తగ్గడంలేదు. గతంలో లేని విధంగా తాజాగా నుంచి బీసీ వసతిగృహాల్లో విద్యార్థుల సంఖ్యను బట్టి నెల వారీ వసూళ్లకు పాల్పడుతున్నారు. ఉమ్మడి కడప జిల్లాలోని ప్రజాప్రతినిధులు అధికారులతో సమీక్షించడం, పాలనను గాడిలో పెట్టే చర్యలు చేపట్టలేదు. కనీసం జిల్లా పరిషత్తు సర్వసభ్య సమావేశంలో సమీక్ష చేస్తారని ప్రజలు ఎదురుచూస్తున్నారు.

సమావేశానికి హాజరుపై అనుమానం

సమావేశానికి హాజరుకావాల్సిన జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవిత, మంత్రి రాంప్రసాద్‌రెడ్డి మంత్రివర్గ సమావేశం కారణంగా రాలేకపోతున్నారు. జడ్పీ సీఈవో ఓబులమ్మ సైతం హైకోర్టులో వ్యక్తిగతంగా హాజరు కావాల్సి ఉన్నందున విజయవాడకు వెళుతున్నారు. సీపీడబ్ల్యూ పథకాల గుత్తేదారు న్యాయం కోసం న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. కలెక్టరు పోస్టు ఖాళీగా ఉండడంతో ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితిసింగ్ హాజర వుతున్నారు. వైకాపా అధినేత జగన్ బద్వేలు పర్యటన నేపథ్యంలో ఆ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు అక్కడికి వెళ్లే అవకాశం ఉంది. దీంతో పలువురు కార్యక్రమానికి గైర్హాజరయ్యే అవకాశం ఉంది.

నవమి బ్రహ్మోత్సవాలకు ప్రణాళికలు సిద్ధం చేయండి

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: ఒంటిమిట్ట కోదండ రామాలయంలో వచ్చే ఏడాది నిర్వహించే శ్రీరామనవమి వార్షిక బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయడానికి చేపట్టనున్న పనులకు వెంటనే ప్రణాళికలను సిద్ధం చేయాలని తితిదే తిరుపతి సంయుక్త కార్యనిర్వహణాధికారి వి.వీరబ్రహ్మం పేర్కొన్నారు. రామయ్య క్షేత్రం ఉత్సవాలపై తిరుపతి పరిపాలన భవనంలో జేఈవో మంగళవారం అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. వీరబ్రహ్మం మాట్లాడుతూ ఈ ఏడాది కంటే మిన్నగా వచ్చే సంవత్సరంలో వైభవంగా నిర్వహించడానికి అవసరమైన ఏర్పాట్లపై ఇప్పటి నుంచే దృష్టి సారించాలని తెలిపారు. భక్తులకు కావాల్సిన మౌలిక వసతులు కల్పించాలని చెప్పారు. రాములోరి సన్నిధి, మాడ వీధులు, విశ్రాంతి భవనం, పుష్కరిణి, కల్యాణ వేదిక ప్రాంతంలో ఇంకా ఎలాంటి సదుపాయలు కల్పించాల్సిన అవసరం ఉందని అడిగి తెలుసుకొన్నారు. పచ్చదనం పెంపు కోసం విరివిగా మొక్కలు నాటించాలని తెలిపారు. ఎక్కడా పారిశుద్ధ్యం లోపం లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఎస్ఈ మనోహర్, ప్రత్యేకాధికారి ప్రశాంతి, ఈఈ సుమతి, డీఈ రవిశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

సిబ్బంది లేక రోగులకు ఇబ్బంది

- వెంటాడుతున్న ఎఫ్ఎన్‌వోల కొరత
- కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి పరిస్థితి



రోగిని స్కానింగ్‌కు స్ట్రెచ్చర్‌పై అతి కష్టం మీద తీసుకెళ్తున్న బంధువు

–న్యూస్‌టుడే, సర్వజన ఆసుపత్రి

కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఎఫ్ఎన్‌వో (మహిళా నర్సింగ్ సిబ్బంది) కొరత వేధిస్తోంది. దీంతో ఓపీ, ఐపీ విభాగాలకు వచ్చే రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. సాధారణంగా వార్డుల్లో చికిత్స పొందుతున్న మహిళలకు వైద్యం కాకుండా మిగిలిన అన్ని సేవలూ ఎఫ్ఎన్‌వోలు అందించాలి. ఆసుపత్రిలో మహిళా రోగుల వార్డులు దాదాపు 23 ఉండగా, మొత్తం ఎఫ్ఎన్‌వోలు 26 మంది మాత్రమే ఉన్నారు. వారు ఉదయం, మధ్యాహ్నం, రాత్రి మూడు విడతల్లో పనిచేయాల్సి ఉంది. శస్త్రచికిత్సలు చేయించుకున్నవారికి డ్రెస్సింగ్, దుస్తుల మార్పు, బెడ్ మేకింగ్, ఎక్స్‌రే, స్కానింగ్, ఈసీజీ, టుడీఎకోకు తీసుకెళ్లడం, వేరే వార్డులకు మార్చడం తదితర పనులు చేయాల్సి ఉంటుంది. సిబ్బంది తక్కువగా ఉండటంతో ఉదయం ఓపీ, ఐపీకి 16 మంది, మధ్యాహ్నం ఐపీకి అయిదుగురు, రాత్రి ఐపీకి అయిదుగురు మాత్రమే వార్డుల్లో సేవలందిస్తున్నారు. దీంతో వార్డుల్లో రోగులకు ఒక్కరు కూడా అందుబాటులో ఉండటం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. స్కానింగ్, ఎక్స్‌రేకి వెళ్లాలంటే రోగుల బంధువులే స్ట్రెచ్చర్, చక్రాల కుర్చీలో అతి కష్టం మీద తీసుకెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.



వార్డులోని రోగిని స్కానింగ్ కోసం చక్రాల కుర్చీలో తీసుకెళుతున్న బంధువులు

పెరిగిన రోగుల సంఖ్య : గతేడాదిగా ఆసుపత్రిలో రోగుల సంఖ్య పెరిగింది. గతంలో రోజుకు 800 నుంచి 1200 వరకు వస్తే ప్రస్తుతం ఆ సంఖ్య 2000 నుంచి 2500లకు పెరిగింది. ఇలాంటి సందర్భంలో రోగులకు సరైన సేవలందాలంటే ఎఫ్ఎన్‌వోల సంఖ్య దాదాపు 50కు పెంచాల్సిన అవసరముందని వైద్యులే చెబుతున్నారు. ప్రస్తుతం సగం మంది కూడా లేకపోవడంతో బంధువులే రోగులకు అన్నీ చేయాల్సి వస్తోంది. ఈ విషయమై ఎఫ్ఎన్‌వోల బాధ్యులు, ఆసుపత్రి నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-2 ఇందిర మాట్లాడుతూ సరిపడా ఎఫ్ఎన్‌వోలు లేరని, ఉన్నవారినే సర్దుబాటు చేస్తున్నామన్నారు. ఒక్కోసారి రెండు వార్డులకు ఒక్కరే పనిచేయాల్సి వస్తోందని, సిబ్బంది అవసరమని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు.

వెబ్‌సైట్‌లో కేజీబీవీ పోస్టుల మెరిట్ జాబితా

కడప విద్య, న్యూస్‌టుడే: జిల్లాలోని కేజీబీవీల్లో పోస్టులకు దరఖాస్తు చేసుకున్న మహిళా అభ్యర్థుల మెరిట్ జాబితాను www.kadapadeo.in వెబ్‌సైట్‌లో, డీఈవో కార్యాలయం, జిల్లా సమగ్రశిక్ష కార్యాలయంలో నోటీస్‌బోర్డుల్లో అందుబాటులో ఉంచినట్లు డీఈఓ అనురాధ తెలిపారు. అభ్యర్థులు లిస్ట్‌లో వారి మార్కులు, మిగతా వివరాలన్నీ సరిచూసుకోవాలన్నారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే లిఖితపూర్వకంగా జిల్లా సమగ్రశిక్ష అధికారికి బుధవారం సాయంత్రం 5 గంటల్లోగా అందజేయాలని సూచించారు.



రహదారి పక్కన నిలిపిన విద్యుత్తు బస్సు

పంక్చర్ దుకాణంలో నట్లు బిగిస్తున్న సిబ్బంది →

ఆర్టీసీ విద్యుత్తు బస్సుకు తప్పిన పెను ప్రమాదం

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే: ఆర్టీసీ విద్యుత్తు బస్సుకు పెను ప్రమాదం తప్పింది. నిర్వహణ సరిగా లేకపోవడంతోనే ఈ పరిస్థితి నెలకొంది. ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి... కడప నుంచి తిరుపతికి మంగళవారం ఆర్టీసీ శీతల విద్యుత్తు బస్సు ప్రయాణికులతో బయలుదేరింది. మార్గమధ్యలో మాధవరం వద్దకు వెళ్లగానే బస్సు వెనకాల టైరు నట్లు లూజయ్యాయి. డ్రైవర్ గమనించకుండా అలానే వెళ్తున్నారు. అదే సమయానికి ఆ బస్సు పక్కన వెళ్తున్న కారులోని ప్రయాణికులు గుర్తించి, వెంటనే విషయాన్ని డ్రైవర్‌కు చెప్పారు. దీంతో రోడ్డు పక్కనే నిలిపివేయడంతో ఒక్కసారిగా ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. టైర్లు బాగున్నాయా, నట్లు బాగున్నాయా అని చూసుకోకుండా బస్సు ఎలా నడుపుతున్నావంటూ డ్రైవరుపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమీపంలోని టైరు పంక్చర్ దుకాణం వద్దకు బస్సును తీసుకెళ్లి నట్లను బిగించడంతో తిరిగి బయలుదేరింది. ఒక వేళ కారులోని ప్రయాణికులు గమనించకపోతే భారీ ప్రమాదం జరిగి ప్రాణ నష్టం సంభవించేది. ఈ విషయమై ఆర్టీసీ ఆర్ఎం గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ శీతల విద్యుత్తు బస్సులకు కడపలో ఛార్జింగ్ మాత్రమే పెడతారని, వాటి నిర్వహణ తిరుపతిలోని విద్యుత్తు బస్సుల ఏజెన్సీ వాళ్లు చూస్తారని, విషయాన్ని వారి దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు.

ప్రతి నీటిచుక్కనూ ఒడిసిపడదాం!

- మండలానికి వెయ్యి ఇంకుడు గుంతల తవ్వకానికి నిర్ణయం
- వైఎస్ఆర్‌లో 35 వేలు, అన్నమయ్యలో 30 వేలు లక్ష్యం

వర్షపునీటిని ఒడిసిపట్టాలి. భూమిలోకి ఇంకించాలి. పుడమి ఒడిలో భద్రంగా దాచిపెట్టాలి. గంగ బెంగ తీరాలి. జలశోకం రూపుమాపేలా ఇంకుడు గుంతలు తవ్వించాలని ఎన్డీయే ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది. ప్రజాభాగస్వామ్యంతో మహోద్యమం దూకుడుగా సాగించాలని నిర్ణయించింది. తాజాగా జిల్లాల వారీగా లక్ష్యాలు నిర్దేశించింది. క్షేత్రస్థాయిలో నరేగా పద్దు ఖర్చు చేయాలని పచ్చజెండా ఊపింది.

–న్యూస్‌టుడే, ఒంటిమిట్ట

వైఎస్ఆర్ జిల్లాలో 35, అన్నమయ్య జిల్లాలో 30 మండలాలున్నాయి. ఉపాధి హామీ పథకం అమలులో భాగంగా 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఒక్కో మండలంలో వెయ్యి చొప్పున ఇంకుడు గుంతల తవ్వకానికి రెండు రోజుల కిందట రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులందాయి. ఒక్కో గుంత పొడవు వెడల్పు లోతు 1.20 మీటర్లు ఉండాలని నమూనా ఆకృతి పంపించారు. ఎన్ని సెం.మీ. పెద్ద, చిన్న రాళ్లు, కంకర ఎంత పరిమాణంలో వాడాలో సూచించారు. ఇందుకోసం పనులు చేసిన కూలీల వేతనాలకు రూ.550, సామగ్రి కొనుగోలుకు రూ.5,450 ఖర్చు చేయాలని అనుమతిచ్చారు. ఈ లెక్కన రెండు జిల్లాల్లో కలిపి సుమారు రూ.39 కోట్లకు పరిపాలన అనుమతిచ్చారు. నరేగా విభాగంలో పనిచేస్తున్న క్షేత్ర, సాంకేతిక సహాయకులు, ఈసీ, ఏపీవో, ఏపీడీ, ఎంపీడీవోలు ప్రణాళికను సిద్ధం చేసి వెంటనే పనులకు శ్రీకారం చుట్టాలని ఆదేశించారు. వాననీటిని ఒడిసిపట్టేందుకు ప్రతిఒక్కరూ భగీరథుడిలా పనిచేయాలని ఉత్తర్వులిచ్చారు. వీధుల్లో నీరు ఎక్కువగా నిలిచే ప్రదేశాలను గుర్తించి ఇంకుడు గుంత తవ్వించాలని ఉన్నత స్థాయి నుంచి ఉత్తర్వులందాయి. మురుగు సమస్య ఉన్న ప్రాంతాల్లోనూ పనులు చేపట్టాల్సి ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



ఒంటిమిట్ట మండలం సాలాబాద్‌లో నిర్మించిన ఇంకుడుగుంత

ప్రజల భాగస్వామ్యంతో విజయవంతం

జిల్లాలో ఇంకుడు గుంతల తవ్వకంపై ప్రత్యేకంగా దృష్టి సారించాం. ప్రజల భాగస్వామ్యంతో జలస్ఫూర్తితో తవ్వించడానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాం. ప్రతి మండలంలో వెయ్యి తవ్వాలని ఉన్నతాధికారులు అనుమతిచ్చారు. నిర్దేశిత లక్ష్యాన్ని వచ్చే ఏడాది జనవరి 15వ తేదీలోగా పూర్తిచేస్తాం.

- విజయ్‌కుమార్, ఇన్‌ఛార్జి పీడీ, నీటి యాజమాన్య సంస్థ, కడప



మాట్లాడుతున్న పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయ్య, పక్కన నాయకులు

30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలి

కడప విద్య, న్యూస్‌టుడే : ఉద్యోగ, ఉపాధ్యాయులకు వెంటనే 30 శాతం మధ్యంతరభృతిని ప్రకటించాలని పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు మిట్టా కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. స్థానిక పీఆర్టీయూ జిల్లా కార్యాలయంలో మంగళవారం ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. కృష్ణయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయులకు రావాల్సిన జడ్పీపీఎఫ్, ఏపీజీఎల్ఐ లోన్ బకాయిలు, ఏపీజీఎల్ఐ, జడ్పీపీఎఫ్ తుది చెల్లింపులు, డీఏ అరియర్స్, సరెండర్‌లీవ్ బకాయిలు, రిటైర్ అయిన ఉపాధ్యాయులకు ఈఈఎల్, జీఐఎస్ చెల్లించాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మోపూరి వెంకటశివారెడ్డి మాట్లాడుతూ ఎఫ్ఎల్ఎన్ శిక్షణ తరగతులను జిల్లా కేంద్రంలో, నాన్‌రెసిడెన్షియల్ విధానంలో నిర్వహించాలని సూచించారు. సీపీఎస్ రాష్ట్ర కన్వీనర్ గుజ్జల తిరుపాల్ మాట్లాడుతూ ప్రతినెలా ప్రభుత్వం చెల్లించాల్సిన సీపీఎస్ మ్యాచింగ్ గ్రాంటును ఆలస్యం చెయ్యకుండా క్రమం తప్పకుండా ప్రతి నెలా ఉద్యోగుల ఖాతాలకు జమచేయాలని పేర్కొన్నారు. జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు కందుల వెంకటసుబ్బారెడ్డి, ఇరగనబోయిన రామమూర్తి, నరసింహులు, రామాంజనేయులరెడ్డి, కుంచ శ్రీనివాసులు, ముక్కర హరినాథ్‌బాబు, ప్రతాపుడు, కరమతుల్లా, బ్రహ్మాదేవిప్రసాద్, చంద్రశేఖర్‌రెడ్డి, రమణ తదితరులు పాల్గొన్నారు.

మద్యం తయారీ సంస్థలో సీఐడీ సోదాలు

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: కడప నగర శివారులోని ఈగల్ డిస్ట్రలరీస్ కంపెనీలో మంగళవారం సీఐడీ అధికారులు సోదాలు చేపట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన తనిఖీల్లో సుమారు 10 మంది సీఐడీ అధికారులతో పాటు ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు. గత అయిదేళ్లలో ఎంత మద్యం తయారు చేశారు, రాష్ట్ర వ్యాప్తంగా ఎన్ని కేసుల సరకు సరఫరా చేశారనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాటిలింగ్ యూనిట్‌లో తనిఖీలు చేశారు. నిబంధనల ప్రకారం మద్యం తయారు చేస్తున్నారా?, ఏవైనా అవకతవకలున్నాయా అనే కోణంలో పరిశీలించారు. ఎంత మంది సిబ్బంది, వారికి అందుతున్న జీత భత్యాలు తదితర వాటిపై ఆరా తీశారు. కొన్ని దస్త్రాలను తీసుకెళ్లినట్లు సమాచారం.

ఆర్టీసీ దసరా ఆదాయం రూ.1,02,84,721

కడప, చిన్నచౌకు, న్యూస్‌టుడే: దసరా సందర్భంగా ప్రయాణికుల రాకపోకలకు జిల్లా వ్యాప్తంగా ఆరు డిపోల పరిధిలో 390 ప్రత్యేక బస్సు సర్వీసుల ఏర్పాటుతో రూ.1,02,84,721 ఆదాయం వచ్చిందని ఆర్ఎం గోపాల్‌రెడ్డి తెలిపారు. విజయవాడకు 53, బెంగళూరుకు 128, హైదరాబాదుకు 99, చెన్నై 22, తిరుపతి 51, కర్నూలు 08, ఇతర ప్రాంతాలకు 29 బస్సులను నడిపారు. అత్యధికంగా బెంగళూరు సర్వీసులకు రూ.30,48,665 ఆదాయం వచ్చిందని చెప్పారు.

పూడిక తీస్తేనే పూర్వవైభవం!

మైలవరం జలాశయంలో తగ్గిన నీటి నిల్వ సామర్థ్యం


రాష్ట్రంలోని మధ్య, చిన్నతరహా ప్రాజెక్టుల్లో పూడిక పెరిగిపోవడంతో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోతోందని కేంద్ర జల సంఘం తాజా నివేదికలో ఆందోళన వ్యక్తం చేసింది. నివేదికలో పది జలాశయాలు ఉండగా, అందులో రెండో స్థానంలో జిల్లాలోని మైలవరం జలాశయం ఉండడం గమనార్హం. కేంద్ర జలసంఘం చేపట్టిన రిమోట్ సెన్సింగ్ సర్వే, రాష్ట్ర ప్రభుత్వ హైడ్రోగ్రాఫిక్ సర్వేల ఆధారంగా నివేదికను కేంద్ర జలసంఘం రూపొందించింది. మైలవరం జలాశయంలో వివిధ సంవత్సరాలలో సర్వేలు నిర్వహించినట్లు అందులో పేర్కొంది. 2021లో సర్వే ప్రకారం నిల్వ సామర్థ్యం 0.76 టీఎంసీల మేర తగ్గినట్లు గుర్తించారు.

–న్యూస్‌టుడే, జమ్మలమడుగు

పెన్నానదిపై మైలవరం వద్ద 1971, మార్చి 30న జలాశయానికి శంకుస్థాపన చేస్తే, 1983లో పనులు పూర్తయ్యాయి. అప్పట్లో సుమారు రూ.23.84 కోట్లు ఖర్చు చేశారు. 9.965 టీఎంసీల సామర్థ్యంతో మైలవరం నిర్మించగా, గండికోట జలాశయం నిర్మాణంతో 6.500 టీఎంసీలకు సామర్థ్యం పడిపోయింది. జలాశయం పరిధిలో ఉత్తర, దక్షిణ కాలువల కింద 75 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. గండికోట పూర్తి సామర్థ్యం 26 టీఎంసీలు నింపిన తర్వాత మైలవరం జలాశయంలోకి మళ్లిస్తారు. మైలవరం జలాశయం నిండగానే దిగువనున్న పెన్నాలోకి వదిలేస్తారు. లేకపోతే గండికోట చుట్టుపక్కనున్న గ్రామాలకు ఇబ్బందికర పరిస్థితులు తలెత్తుతాయి. 2021, నవంబరు 20న అత్యధికంగా 1.55 లక్షల క్యూసెక్కుల నీటిని జలాశయం నుంచి కిందకు విడుదల చేశారు. జలాశయం 50 ఏళ్ల చరిత్రలో అదే అత్యధికం. గండి కోట జలాశయం నుంచి ఏటా నీరు వచ్చి చేరుతుండడంతో పూడిక పేరుకుపోతోంది. మైలవరం జలాశయంలో చేరిన ఒండ్రుమట్టి బయటకు పోయే పరిస్థితి లేకపోవడంతో అదనపు నీటి నిల్వకు అవకాశం లేకుండా పోతోంది. మ్యూజియం వెనక పెద్దఎత్తున పూడిక చేరిపోయింది. అటువైపు నుంచి చూస్తే ప్రాజెక్టు పాడుబడినట్లు ఉంటుంది. ఒక టీఎంసీతో నీటి ఆధారిత పంటలైతే 10 వేల ఎకరాలు, ఆరుతడికైతే 13 నుంచి 15 వేల ఎకరాలు పండించవచ్చు.

మైలవరం జలాశయం నుంచి పెన్నాకు విడుదలైన నీరు

సంవత్సరం	అవుట్‌ఫ్లో (టీఎంసీలలో)
2020-2021	31.342
2021-2022	48.678
2022-2023	16.00
2023-2024	07.00
2024-2025	10.00



మైలవరం జలాశయంలో పేరుకుపోయిన పూడిక

ఎలాంటి ప్రమాదం ఉండదు - రమేష్, ఈఈ

జలాశయంలో పేరుకుపోయిన పూడికతో ప్రమాదం ఉండదు. మట్టి, ఇసుక ఎప్పటికప్పుడు వెళ్లిపోయేందుకు గేట్ల కింద స్కవర్ స్లూయిస్ (పూడిక గేట్లు) ఉంటాయి. వాటి ద్వారా పూడిక సమస్యను అధిగమించవచ్చు.

డిసెంబరు 31 లోపు కర్మాగారాల లైసెన్స్ రుసుం చెల్లించాలి

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే: 2025 సంవత్సరానికి సంబంధించి కర్మాగారాల నిర్ణీత లైసెన్స్ రుసుం ఈ ఏడాది డిసెంబరు 31వ తేదీ లోపు సీఎఫ్ఎంఎస్ ద్వారా చెల్లించాలని కర్మాగారాల తనిఖీ అధికారి కృష్ణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. కట్టిన చలానాను సంబంధిత కర్మాగారాల తనిఖీ అధికారికి పంపాలని సూచించారు. లైసెన్స్ ఫీజుల్లో, హెడ్ ఆఫ్ అకౌంట్, డీడీఓ, కోడ్‌లలో ఎటువంటి మార్పు లేదన్నారు. ఫ్యాక్టరీలో అదనంగా హార్స్‌పవర్ పెంచినా, అదనంగా పనివాళ్లను నియమించినా, పెరిగిన దాని ప్రకారం బ్యాలెన్స్ లైసెన్స్ ఫీజు చెల్లించాలని సూచించారు. సీఎఫ్ఎంఎస్ ద్వారా చెల్లించడంలో ఎటువంటి సందేహాలున్నా 91603 83971, 92958 50949 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

23 నుంచి ఐటీఐలో చివరి విడత ప్రవేశాలు

వైవీయూ (కడప), న్యూస్‌టుడే: జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కళాశాల్లో మిగిలి ఉన్న సీట్ల భర్తీకి ఈ నెల 23 నుంచి 26వ తేదీ వరకు చివరి విడత ప్రవేశాలు నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ మైనారిటీ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ ఎం.జ్ఞానకుమార్ తెలిపారు. పది, ఇంటర్ పాస్ లేదా ఫెయిల్ అయిన విద్యార్థులు ప్రవేశాలు పొందవచ్చన్నారు. ఆసక్తిగల వారు iti.ap.gov.in వెబ్‌సైట్లో రిజిస్టర్ చేసుకుని, 27, 28 తేదీల్లో తమ సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయించుకోవాలని సూచించారు. 30వ తేదీ ఆయా కళాశాలల్లో కౌన్సెలింగ్ నిర్వహిస్తారని పేర్కొన్నారు.

నవోదయ, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కడప విద్య, న్యూస్‌టుడే: జవహర్ నవోదయలో 9వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ఖాళీ సీట్లను భర్తీచేయడానికి 8వ తరగతి, పదోతరగతి చదువుతున్న విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి అనురాధ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ నెల 30 లోగా దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు navodaya.gov.in వెబ్‌సైట్‌లో చూడాలని చెప్పారు.

బాధిత కుటుంబాలకు అండగా పోలీస్‌శాఖ



ఎస్.ఐ. కుటుంబ సభ్యులకు లక్ష రూపాయల చెక్కు అందజేస్తున్న ఏఎస్పీ ప్రకాష్‌బాబు

కడప, నేరవార్తలు, న్యూస్‌టుడే: వివిధ రకాల కారణాలతో మృతి చెందిన పోలీసుల కుటుంబాలకు జిల్లా పోలీసు శాఖ ఎప్పుడూ అండగా ఉంటుందని ఏఎస్పీ ప్రకాష్ బాబు అన్నారు. ప్రొద్దుటూరులోని రెండో పట్టణ ఠాణాలో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న సుబ్బరాయుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన సతీమణి వెంకటలక్ష్మికి కార్పస్ ఫండ్ నుంచి రూ.లక్ష చెక్కు మంగళవారం అందజేశారు. ఏఎస్పీ మాట్లాడుతూ ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకుని రావాలని, పోలీసులు వారి ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డీపీవో ఏవో జ్యోతి ఉన్నారు.

వీర్‌గాథ 4.0!

- న్యూస్‌టుడే, కడప విద్య

విద్యార్థుల్లో దేశభక్తి పెంపొందించేందుకు శ్రీకారం
పోటీల నిర్వహణకు కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు



బద్వేలు జిల్లాపరిషత్తు ఉన్నత పాఠశాల తరగతి గదిలో విద్యార్థినులు

విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించడమే లక్ష్యంగా వీర్‌గాథ 4.0 పోటీల నిర్వహణకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా 3వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు పోటీలు నిర్వహించనుంది. రక్షణ, విద్యామంత్రిత్వశాఖలు సంయుక్తంగా పోటీలకు సంబంధించి జిల్లాలోని ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపల్స్‌కు ఆదేశాలు జారీ చేసింది. తొలుత పాఠశాల స్థాయిలో విద్యార్థులకు పోటీలు నిర్వహించి వీర్‌గాథ పోర్టల్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. గ్యాలంటరీ అవార్డు గ్రహీతలైన సైనిక వీరుల ధైర్య సాహసాలు, త్యాగాలు, జీవితగాథలను నేటి విద్యార్థులకు పరిచయం చేయడానికి పోటీలు నిర్వహించనున్నట్లు వెబినార్ల ద్వారా వివిధ సెషన్లలో దృశ్యశ్రవణ కార్యక్రమాలు చేపడుతున్నట్లు అధికార యంత్రాంగం చెబుతోంది.

కేటగిరీల వారీగా విద్యార్థులకు నిర్వహించే పోటీలు

కేటగిరీ	తరగతులు
1	3, 4, 5
2	6, 7, 8
3	9, 10
4	ఇంటర్మీడియట్

ఎంపిక ఇలా

జిల్లాస్థాయిలో నవంబరు 10వ తేదీ వరకు, రాష్ట్రస్థాయిలో నవంబరు 12 నుంచి 30వ తేదీ వరకు, జాతీయ స్థాయిలో డిసెంబరు 4 నుంచి 24వ తేదీ వరకు పోటీలు నిర్వహించనున్నారు. సీబీఎస్ఈ పాఠశాలలు మినహా జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులందరూ అర్హులే. అక్టోబరు 31వ తేదీలోగా పాఠశాల స్థాయిలో కవితారచన, వ్యాసరచన, డ్రాయింగ్, పెయింటింగ్ పోటీలు జరపాల్సి ఉంటుంది. ప్రతి కేటగిరీలో మొదటి స్థానంలో నిలిచిన ఎంట్రీ (మొత్తం 4 ఎంట్రీల) ప్రధానోపాధ్యాయుడు మైగౌట్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఉన్నతాధికారులు జిల్లాస్థాయిలో మొదటి నలుగురిని, రాష్ట్రస్థాయిలో మొదటి 8 మందిని, జాతీయ స్థాయిలో మొదటి వంద మందిని (సూపర్ 100) ఎంపిక చేసి రానున్న గణతంత్ర దినోత్సవం రోజున బహుమతులు అందజేస్తారు. వీరిని సూపర్ 100 విజేతలుగా పిలుస్తారు. ఇందులో 3 నుంచి 5వ తరగతి వరకు 25 మందిని, 6 నుంచి 8వ తరగతి వరకు 25 మందిని, 9, 10 తరగతులకు చెందిన 25 మంది, ఇంటర్మీడియట్‌కి చెందిన 25 మందిని మొత్తంగా వంద మందిని జాతీయస్థాయికి ఎంపిక చేస్తారు. జిల్లా, రాష్ట్రస్థాయిలోని విజేతలకు ధ్రువపత్రాలు అందజేస్తారు. జాతీయస్థాయి విజేతలకు రక్షణ, విద్యామంత్రిత్వ శాఖలు రూ.10 వేలు చొప్పున నగదు అందజేస్తాయి.

విభాగం	సంఖ్య	విద్యార్థులు
ప్రాథమిక	1,896	1,19,684
ప్రాథమికోన్నత	323	41,085
ఉన్నత	586	1,57,211
హైస్కూల్‌ప్లస్, ఆదర్శ, వసతిగృహాలు	40	14,244
జూనియర్ కళాశాలలు	152	41,900

విద్యార్థులకు మంచి అవకాశం



విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించేందుకు, వారిలోని సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇదొక చక్కటి అవకాశం. విజేతలకు నగదు బహుమతులతోపాటు ప్రశంసాపత్రాలు ప్రదానం చేస్తారు. అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

- మదితాటి నరసింహారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు, జడ్పీ ఉన్నత పాఠశాల, నందలూరు, అన్నమయ్య జిల్లా

ఎక్కువ మంది పాల్గొనేవిధంగా చర్యలు



పోటీల్లో ఎక్కువ మంది విద్యార్థులు పాల్గొనేవిధంగా చర్యలు తీసుకుంటున్నాం. ప్రధానోపాధ్యాయులకు మార్గనిర్దేశం చేస్తున్నాం. ఉపాధ్యాయులు ప్రతి పాఠశాలను వీర్‌గాథ వెబ్‌పోర్టల్‌లో నమోదు చేయాలి. అనంతరం విద్యార్థులకు పోటీలు నిర్వహించి నలుగురిని ఎంపిక చేసి పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి.

- అనురాధ, డీఈవో, వైఎస్ఆర్ జిల్లా

బాధిత కుటుంబానికి జగన్ పరామర్శ నేడు

బద్వేలు: మాజీ సీఎం జగన్ బుధవారం మధ్యాహ్నం వైఎస్సార్ జిల్లా బద్వేలుకు రానున్నారు. గుంటూరు పర్యటన ముగించుకుని హెలికాప్టర్‌లో గోపవరం మండలం పీపీకుంట హెలిప్యాడ్ వద్ద దిగనున్నారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో బద్వేలు చేరుకుంటారు. అనంతరం ఇటీవల హత్యకు గురైన ఇంటర్ విద్యార్థిని కుటుంబాన్ని పరామర్శిస్తారు. మాజీ సీఎం రాక సందర్భంగా పీపీకుంట సెంచరీ ప్లైఉడ్ వద్ద హెలిప్యాడ్ ఏర్పాట్లను ఎమ్మెల్యే సుధ, ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పరిశీలించారు.

పీబీఆర్‌కు పోటెత్తిన వరద



కృష్ణాజలాలతో పీబీఆర్‌కు జలకళ

లింగాల, న్యూస్‌టుడే : ఎగువన కురిసిన భారీ వర్షాలకు పెంచికల బసిరెడ్డి జలాశయం(పీబీఆర్) జలాశయంలోకి భారీగా వరద నీరు చేరుతోంది. అనంతపురం జిల్లా ధర్మవరం, గొట్లూరు చెరువులు నిండి జలాశయంలోకి మంగళవారం ఉదయం 1500 క్యూసెక్కుల నీరు చేరగా సాయంత్రానికి 5 వేల క్యూసెక్కులకు చేరింది. రాత్రికి 10 వేల క్యూసెక్కులకు పెరగొచ్చని పీబీసీ ఈఈ రాజశేఖర్ తెలిపారు.

మైలవరానికి కృష్ణాజలాల విడుదల...

కొండాపురం: గండికోట జలాశయం నుంచి మైలవరం రిజర్వాయర్‌కు 6 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు జలవనరులశాఖ డీఈ ఉమామహేశ్వర్లు మంగళవారం తెలిపారు. నంద్యాల జిల్లా అవుకు జలాశయం నుంచి గండికోట ప్రాజెక్టుకు ప్రస్తుతం 6 వేల క్యూసెక్కుల నీరు వస్తున్నట్లు తెలిపారు. జలాశయంలో నీటిమట్టం పెరగకుండా మైలవరం జలాశయానికి నీటిని పంపుతున్నట్లు వివరించారు. గండికోట జలాశయం పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 26.85 టీఎంసీలు కాగా ప్రస్తుతం జలాశయంలో 26.3 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు తెలిపారు.

ఎర్రచందనం అక్రమ రవాణా నివారణకు చర్యలు

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే : ఎర్రచందనం రక్షణకు ప్రభుత్వం బడ్జెట్‌ను కేటాయించిందని, అక్రమ రవాణా అడ్డుకట్టకు ఏమేం వసతులు కల్పించాలో సిబ్బంది తెలియజేయాలని కడప డీఎఫ్‌వో వినీత్‌కుమార్ పేర్కొన్నారు. ఆయన మంగళవారం మధ్యాహ్నం సబ్ డీఎఫ్‌వోలు, రేంజర్లతో ఎర్రచందనం రక్షణపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వినీత్‌కుమార్ మాట్లాడుతూ... జిల్లాలోని 22 బేస్‌క్యాంపులతో పాటు 10 చెక్‌పోస్టులను బలోపేతం చేసి, ఎర్రచందనం రక్షణకు పాటుపడవచ్చన్నారు. ముఖ్యంగా బేస్‌క్యాంపులలో పనిచేస్తున్న సిబ్బందికి కావాల్సిన సామాగ్రిని అందజేయాలన్నారు. సకాలంలో జీతాలు ఇవ్వడంతో పాటు యూనిఫామ్స్, షూ, టెంట్స్, పవర్ బ్యాంక్స్ సౌకర్యం కల్పించాలని సూచించారు. డీఎఫ్‌వో, రేంజి కార్యాలయాలు, బేస్‌క్యాంపు, చెక్‌పోస్టులకు వైర్‌లెస్ కనెక్టివిటీ ఉండేలా చూడాలని చెప్పారు. చెక్‌పోస్టుల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. కడప, ప్రొద్దుటూరు సబ్ డీఎఫ్‌వోలు స్వామి వివేకానంద, దివాకర్, రేంజర్లు బాలసుబ్రహ్మణ్యం, ప్రసాద్, హేమాంజలి, కళావతి, ప్రణీతబాయి, రఘునాథరెడ్డి, ప్రణీత్, అశోక్‌కుమార్ యాదవ్, ఇన్‌చార్జి ఎఫ్ఆర్‌వో శేషయ్య పాల్గొన్నారు.

సంఘటితంగా ఉద్యమించాలి

మారుతీనగర్, న్యూస్‌టుడే: సమస్యల పరిష్కారంపై ఆటో కార్మికులు ఐక్యంగా ఉద్యమించాలని, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి తెలిపారు. స్థానిక పాత రిమ్స్ ఆటో స్టాండ్ వద్ద మంగళవారం ఏఐటీయూసీ అనుబంధ ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్, నగర సమితి ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు గుర్తింపు కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఆటో కార్మికుల సమస్యలపై సమీక్షించి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండు చేస్తామన్నారు. ఈ చలానాల పేరుతో పోలీసులు వేధిస్తున్నారని, వాటిని రద్దు చేయాలని సూచించారు. నగర అధ్యక్ష, కార్యదర్శులు పుల్లయ్య, నారాయణ, అంకుశం, తదితరులు పాల్గొన్నారు.

'హామీల అమలులో ప్రభుత్వం విఫలం'



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

మారుతీనగర్, న్యూస్‌టుడే: ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ తెలిపారు. స్థానిక జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ రైతులకు పెట్టుబడి సహాయం కింద రూ.20వేలు, అమ్మకు వందనం, విద్యార్థుల ఫీజు రీఇంబర్స్‌మెంట్, దీపం పథకం కింద ఇస్తున్న మూడు సిలిండర్లపై కూడా స్పష్టత లేదన్నారు. ప్రభుత్వం ఇస్తున్న ఇసుక విధానంలో గందరగోళం ఉందని చెప్పారు. గతంలో వైకాపా ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైందని, ప్రస్తుతం తెదేపా అదేబాటలో పయనిస్తుందని, ప్రజలు ఇవన్నీ గమనిస్తున్నారన్నారు. సీపీఎం జిల్లా మహాసభలు డిసెంబరు 14, 15 తేదీల్లో నగరంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు రామ్మోహన్, జిల్లా కమిటీ సభ్యుడు దస్తగిరిరెడ్డి పాల్గొన్నారు.

ఉక్కు కర్మాగారం ఏర్పాటు ఎప్పటికో?

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే: రాయలసీమ నుంచి ఎంతో మంది నాయకులు ముఖ్యమంత్రి, ఇతర ఉన్నత పదవులు చేపట్టినా ఇప్పటి వరకు ఉక్కు కర్మాగారం ఏర్పాటు చేయకపోవడం బాధాకరమని భారత విప్లవ కమ్యూనిస్టు పార్టీ (ఆర్‌సీపీఐ) రాష్ట్ర కార్యదర్శి సతీష్ అన్నారు. కడప ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆర్‌సీపీఐ ఆధ్వర్యంలో జిల్లా కార్యకర్తల సమావేశం నిర్వహించారు. రాయలసీమ కో-ఆర్డినేటర్ నాగన్న, రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ కలాం హాజరయ్యారు. సతీష్ మాట్లాడుతూ జిల్లా కరవుకాటకాలకు నిలయమని, ఇక్కడ యువతకు ఉపాధి కల్పనకు ఉక్కు పరిశ్రమ నెలకొల్పాలని చెప్పారు. అనంతరం ఆర్‌సీపీఐ జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా శేఖర్, కమిటీ సభ్యులుగా శ్రీనివాసులు, ఓబులేసు, నరసింహులు, శరత్‌చంద్రప్రసాద్, కరీముల్లా, గురురాంప్రసాద్ ఎన్నికయ్యారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి దారుణ హత్య

బద్వేలు, గోపవరం, న్యూస్‌టుడే : బద్వేలు గ్రామీణ పోలీసుస్టేషన్ పరిధి శ్రీనివాసపురంలో మంగళవారం రాత్రి తిప్పిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి (45) అనే వ్యక్తి దారుణ హత్యకు గురయ్యారు. ఇంటి ముందు కూర్చున్న ఆయనను వరుసకు కుమారుడైన భాస్కర్‌రెడ్డి కడ్డీతో ఛాతీపై పొడిచి పారయ్యాడు. సీఐ నాగభూషణం వివరాల ప్రకారం.. రెండేళ్లగా ఇద్దరి మధ్య కుటుంబ కలహాలు నడుస్తున్నాయి. ఈ క్రమంలో భాస్కర్‌రెడ్డి పథకం ప్రకారం వెంకటసుబ్బారెడ్డిని పొడవడంతో అక్కడే కుప్పకూలిపోయారు. కొన ఊపిరితో ఉన్న ఆయనను కుటుంబ సభ్యులు బద్వేలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. నిందితుడి కోసం గాలిస్తున్నారు.

భాషా నైపుణ్యాలు పెంపొందించాలి



పోటీల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డీఈవో అనురాధ, కమిటీ నాయకులు

కడప విద్య, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో తెలుగుభాషా నైపుణ్యాన్ని పెంపొందించడానికి కృషిచేయాలని జిల్లా విద్యాశాఖాధికారి అనురాధ అన్నారు. స్థానిక డీఈవో కార్యాలయంలో కడప బాలోత్సవం పోటీల కరపత్రాలను కమిటీ నాయకులతో కలిసి ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గోపాల్ మాట్లాడుతూ బాలల్లో సృజనాత్మక శక్తిని వెలికితీయడానికి కడప బాలోత్సవం పేరుతో వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. నవంబరు 14న బాలల దినోత్సవం పురస్కరించుకొని 6, 7, 8 తరగతుల (జూనియర్స్) విద్యార్థులకు వ్యాసరచన- 'ట్రాఫిక్ సమస్యలు, పరిష్కారాలు', పద్యాలాపనలో వేమన, సుమతి శతక పద్యాలు, సీనియర్స్ విభాగంలో 9, 10 తరగతుల వారికి వ్యాసరచనలో మత్తుపదార్థాలు - యువతపై ప్రభావం, నాటకరంగ పద్యాల్లో శ్రీకృష్ణరాయబారం (పడకసీను), సత్యహరిశ్చంద్రలో (కాటిసీను) అంశాలపై పోటీలు ఉంటాయని నిర్వహించనున్నామని తెలిపారు. కడప నగరంలోని ఎస్‌వీ ఇంజినీరింగ్ కళాశాలలో పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. సమావేశంలో విశ్రాంత డిప్యూటీ డీఈవో నాగమునిరెడ్డి, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు బాల ఎల్లారెడ్డి, బాలోత్సవ కమిటీ జిల్లా కార్యదర్శి బాలుగారి వెంకటసుబ్బయ్య, సుందరయ్య కమిటీ సభ్యులు మధుసూదన, పెద్ద సుబ్బారెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమ నిధి పునరుద్ధరించాలి

మారుతీనగర్, న్యూస్‌టుడే: భాజపా ప్రభుత్వం వచ్చిన తరువాత బీడీ చట్టం, బీడీ కార్మిక సంక్షేమ చట్టం రద్దు చేయడం అత్యంత దుర్మార్గమని, దీనిని వెంటనే పునరుద్ధరించాలని ఏపీ బీడీ అండ్ సిగర్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఓబులు డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయంలో మంగళవారం రాష్ట్ర సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ చట్టం రద్దు చేయడంతో వైద్యం, ఇళ్ల స్థలాలు, పిల్లలకు స్కాలర్‌షిప్‌లు, వృద్ధాప్య పింఛన్లు, గృహ నిర్మాణం సౌకర్యాలన్నీ కార్మికులు కోల్పోవాల్సి వచ్చిందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున బీడీ ఉత్పత్తుల నుంచి జీఎస్టీ వసూలు చేస్తోందని, దానిలో కొంత మొత్తం కేటాయించి బీడీ కార్మికుల సంక్షేమనిధిని యథావిధిగా కొనసాగించాలని సూచించారు. లేదంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. జిల్లా సంఘం నాయకులు శ్రీనివాసులురెడ్డి, మనోహర్, వెంకటసుబ్బయ్య, దస్తగిరి రెడ్డి, రామకృష్ణా రెడ్డి, అబ్దుల్‌దేశాయ్, కర్నూలు, నెల్లూరు, అన్నమయ్య, అనంతపురం బీడీ కార్మికుల సంఘం నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఓబులు, పక్కన నాయకులు

సత్తాచాటిన కడప బ్యాటర్లు



శివప్రశాంత్ (77 నాటౌట్) | ఫైజాన్ (73 పరుగులు) | మనోజ్‌నాయుడు (4 వికెట్లు) | రేవంత్ (5 వికెట్లు)

కడప క్రీడలు, న్యూస్‌టుడే: ఏసీఏ అండర్-14 మల్టీడే క్రికెట్ టోర్నమెంట్లో భాగంగా వైఎస్ఆర్ఆర్ - ఏసీఏ క్రికెట్ స్టేడియంలో కడప, చిత్తూరు జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్‌లో కడప బ్యాటర్లు సత్తాచాటారు. టాస్ గెలిచి బ్యాటింగ్ ప్రారంభించిన కడప జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 90 ఓవర్లలో 316/8 స్కోరు చేసింది. కె.లోకేష్ 53, శివప్రశాంత్ 77*, ఫైజాన్ 73 పరుగులు చేయగా, ఆశిష్‌రెడ్డి, మౌలా చెరో 2 వికెట్లు తీశారు.

◆ కేవోఆర్ఎం మైదానంలో విశాఖపట్నంతో జరుగుతున్న మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ప్రారంభించిన ప.గో జట్టు 74.3 ఓవర్లలో 112 పరుగులకు ఆలౌటయింది. కేపీ నారాయణ 45, గణేష్ 25, బౌలర్లు మనోజ్ నాయుడు 4, చాణిక్యసాయి 3 వికెట్లు తీశారు. అనంతరం మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించిన విశాఖ జట్టు ఆట ముగిసే సమయానికి 82/0 స్కోరు చేసింది. తమన్‌రెడ్డి, 43*, అక్షిత్‌రెడ్డి 35* పరుగులు చేశారు.

◆ కేఎస్ఆర్ఎం మైదానంలో తూర్పుగోదావరితె జరుగుతున్న మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ప్రారంభించిన కర్నూలు జట్టు 78.5 ఓవర్లలో 162 పరుగులు చేసింది. రుత్విక్‌కళ్యాణ్ 72 పరుగులు చేయగా, రేవంత్ 5, షాహీద్, తమన్ చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించిన తూ.గో జట్టు ఆట ముగిసే సమయానికి 64/2 స్కోరు చేసింది.

ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి

దువ్వూరు, న్యూస్‌టుడే : దువ్వూరు మండలం నీలాపురం గ్రామానికి చెందిన నరసింహుడు (36) ప్రమాదవశాత్తు దువ్వూరు చెరువులో జారీ పడి మృతి చెందినట్లు ఎస్సై వినోద్ కుమార్ తెలిపారు. నరసింహుడు సోమవారం అదే గ్రామానికి చెందిన శ్రీరాములతో కలిసి ద్విచక్రవాహనంపై వనిపెంటకు వెళ్లి సాయంత్రం తిరిగి గ్రామానికి వచ్చారు. దువ్వూరు చెరువు వద్ద స్నానం చేసేందుకు వెళ్లారు. రాత్రయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చెరువు వద్ద గాలించగా అతడి దుస్తులు కనిపించాయి. మంగళవారం చెరువులో నరసింహుడు మృతదేహం లభ్యమైనట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

29 నుంచి డీవైఎఫ్ఐ రాష్ట్ర సమావేశాలు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

వైవీయూ (కడప): డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈ నెల 29, 30 తేదీల్లో కడపలో జరగనున్న రాష్ట్ర కమిటీ సమావేశాలను జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి వి.శివకుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంగళవారం వైవీయూ ప్రధాన ద్వారం వద్ద కరపత్రాలు విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ సమావేశంలో రాష్ట్ర విభజన హామీలు, కడప ఉక్కు, ప్రత్యేక హోదా, కొప్పర్తి పారిశ్రామిక కారిడార్‌పై చర్చ జరుగుతుందని చెప్పారు. అబ్దుల్, నవీన్, ప్రతాప్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా జిల్లాస్థాయి కబడ్డీ ఎంపికలు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన బాలికల కబడ్డీ జట్టు

కడప క్రీడలు, న్యూస్‌టుడే: ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో కడప నగరంలోని డీఎస్‌ఏ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి అండర్-14, 17 బాలబాలికల ఎంపికల పోటీలు ఉత్సాహంగా సాగాయి. జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బి.అరుణకుమారి, వ్యాయామ ఉపాధ్యాయులు ప్రవీణ్ క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. పీడీలు, శిక్షకులు, క్రీడాకారులు పాల్గొన్నారు. **ఎంపికైన క్రీడాకారులు:** అండర్-14 బాలికల విభాగంలో ఎన్‌వీ.అక్షయ, ఎస్.అపర్ణ, వై.నిరూప, ఎం.గంగాదేవి, వై.సంజన, పి.సున్నీ, ఎం.మోక్షిత, జోత్స్న, పీపీ.కుసుమ, ఎం.ప్రశాంతి, టి.భవిత, కె.సుప్రజ **బాలుర విభాగం:** వి.జనార్దన్, జీవీ.విశాల్, ఎస్.ఉస్మాన్, ఎస్.హర్షవర్ధన్, టి.నరేంద్ర, బి.హర్షవర్ధన్, ఎస్.గంగాధర్, ఎం.అంజన్‌కుమార్, ఎస్.నందకిశోర్, ఎ.సురేంద్ర, కె.చరణ్, ఎన్. ప్రశాంత్

జిల్లా స్థాయి ఖోఖో జట్ల ఎంపిక...

కడప క్రీడలు, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాల ఖోఖో సంఘం ఆధ్వర్యంలో బయనపల్లె గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించిన జిల్లా స్థాయి బాలబాలికల జూనియర్స్ ఖోఖో జట్టు ఎంపికలు ఉత్సాహంగా సాగాయి. జిల్లా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కె.రామసుబ్బారెడ్డి, జె.నరేంద్ర క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. **బాలుర జట్టు:** కె.నిఖిల్, కె.మహేష్, ఎ.సందీప్, ఎస్.చిన్నికృష్ణ, బి.యతీష్, పి.అయ్యబాబు, పి.వెంకటేశ్, ఎ.ఇంద్ర, కె.అశోక్, ఇ.గణేష్, ఎస్.యూసఫ్, వెంకటచరణ్, బి.వీరేష్, బి.రాఘవ, చంద్రమౌళి. **బాలికల జట్టు:** పి.సాయిహారిక, పి.వనిత, జి.మేరమ్మ, వై.అశ్విని, జి.హరిత, జి.శివాణి, ఎస్.సున్ని, కె.లోహిత, ఎం.సింధూరి, జె.నందిని, బి.రెడ్డిగీత, జె.యోగరాయల్, డి.యాశ్విన్, ఎస్.గంగదేవి ఎంపికయ్యారు.

నేలతల్లి ఆరోగ్యాన్ని కాపాడండి

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: నేలతల్లి ఆరోగ్యాన్ని రైతులు కాపాడాలని జిల్లా వ్యవసాయాధికారి ఎ.నాగేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని రాచపల్లెలో మంగళవారం నిర్వహించిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని డీఏవో హాజరయ్యారు. కర్షకులతో ముఖాముఖి నిర్వహించారు. పసుపు పంటను పరిశీలించారు. డీఏవో మాట్లాడుతూ భూమిలో సారం, పోషకాల లభ్యత తెలుసుకోవడానికి భూసార పరీక్షలను చేయించుకోవాలని సూచించారు. సమతుల్య ఎరువులను వాడాలని తెలిపారు. యాంత్రీకరణ వైపు ఆసక్తి చూపితే సేద్యం పనులు వేగంగా సకాలంలో పూర్తవుతాయని వివరించారు. జిల్లాలో విత్తన, ఎరువులు, పురుగు మందుల దుకాణాలు నిర్వహించే వ్యాపారులు అక్రమాలకు పాల్పడినా, నకిలీలు విక్రయించినా చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పశుసంవర్ధకశాఖ ఏడీ ఉమ, ఏవో కిరణ్‌కుమార్‌రెడ్డి, ఆర్‌ఎస్‌కే బాధ్యురాలు పుష్పకుమారి పాల్గొన్నారు.

సిద్దవటం: పొలాలను బీడుగా ఉంచుకోకుండా కాలానికి అనుగుణంగా పంటలను సాగు చేయాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి నాగేశ్వరరావు సూచించారు. సిద్దవటం మండలం నేకనాపురంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండల వ్యవసాయ అధికారి రమేష్‌రెడ్డి, రైతు శిక్షణా కేంద్రం అధికారిణి శైలజ, సర్పంచి ఈశ్వరరెడ్డి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సరకుల్లో నాణ్యత కరవు



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి

మారుతీనగర్, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాలకు పౌర సరఫరాల సంస్థ సరఫరా చేసే బియ్యం, గుత్తేదారులు సరఫరా చేసే పప్పు దినుసులు, కోడిగుడ్లు నాణ్యత కొరవడిందని, అధికార యంత్రాంగం గుత్తేదారులను వెనుకేసుకొస్తుండడంతో కార్యకర్తలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి తెలిపారు. స్థానిక హౌచిమెన్ భవనంలో మంగళవారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సరకులు సకాలంలో సరఫరా చేయకపోవడంతో కేంద్రాలు సమస్యల్లో చిక్కుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మంజుల, ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ బాదుల్లా, నగర కార్యదర్శి మద్దిలేటి పాల్గొన్నారు.

డబ్బులిస్తేనే ధ్రువీకరణ పత్రం

☛ సచివాలయ ఉద్యోగుల బదిలీల్లో పుర సిబ్బంది చేతివాటం

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే : ప్రొద్దుటూరు పురపాలక సంఘం కార్యాలయం పరిధిలో సచివాలయ ఉద్యోగుల బదిలీలు ఓ ఉద్యోగి ఆదాయవనరుగా మార్చుకున్నారు. ప్రభుత్వం బదిలీలకు ఆదేశాలివ్వడంతో పురపాలక సచివాలయం నుంచి ఇతర పురపాలక సంఘాలకు, మండలాలకు బదిలీ అయ్యే సమయంలో గత నెల వేతన ధ్రువీకరణ పత్రం, ఉద్యోగ ధ్రువీకరణ పత్రాలు (ఎస్ఆర్) కోసం రూ.1,500 నుంచి రూ.2 వేల వరకు వసూలు చేస్తున్నారు. ఈ మేరకు డబ్బులిస్తేనే ధ్రువీకరణ పత్రాలు ఇస్తున్నారు. ప్రొద్దుటూరు నుంచి జమ్మలమడుగు పురపాలక సంఘానికి బదిలీ అయిన తాను ఉదయం నుంచి సాయంత్రం వరకు ధ్రువీకరణ పత్రం కోసం వేచి చూశానని, డబ్బులు ఇస్తేనే పనిచేస్తానని చెప్పడంతో డబ్బులిచ్చానని ఓ ఉద్యోగి ఎదుట వాపోయారు. ఓ సచివాలయ వార్డు ఎడ్యుకేషన్ కార్యదర్శికి ఓ వార్డును కేటాయిస్తే ఆయనకు అనుకూలంగా ఉన్న వార్డులో నియమించేందుకు రూ.5 వేలు వసూలు చేశారు. ప్రొద్దుటూరు పరిధిలో వార్డు గ్రామ మహిళా కార్యదర్శులకు ఇంక్రిమెంట్లు వేతనంలో కలపాలని ఎస్పీ కొద్ది నెలల కిందట ఆదేశాలు జారీ చేసినా ఇంక్రిమెంట్లను వేతనంలో కలపలేదు. మొత్తం 46 మంది సచివాలయ మహిళా కార్యదర్శులు ఉండగా, ఒక్కొక్కరి నుంచి రూ.600 కావాలని సదరు ఉద్యోగి డిమాండు చేశారు. డబ్బులివ్వలేదని నేటికీ వారికి ఇంక్రిమెంట్లు మంజూరు చేయలేదు. సదరు ఉద్యోగిపై గత కమిషనర్ రఘునాథరెడ్డికి సచివాలయ ఉద్యోగులు ఫిర్యాదు సైతం చేశారు. ఈ విషయమై కమిషనర్ మల్లికార్జున మాట్లాడుతూ సదరు ఉద్యోగిపై గతంలో ఫిర్యాదులు వచ్చిన మాట వాస్తవమేనని, మెమో జారీ చేయడంతో పాటు సీటును మార్చినట్లు తెలిపారు.

ప్రొద్దుటూరు

• ప్రొద్దుటూరు • జమ్మలమడుగు • బద్వేలు • మైదుకూరు

విశ్రాంత సైనికుడికి స్ఫూర్తి పురస్కారం



వెంకటరమణారెడ్డిని సన్మానిస్తున్న రామకృష్ణారెడ్డి, సంస్థ ప్రతినిధులు

కలసపాడు, న్యూస్‌టుడే : మండలంలోని రాజుపాలెం గ్రామానికి చెందిన విశ్రాంత సైనికుడు పాలకొలను వెంకటరమణారెడ్డికి స్ఫూర్తి పురస్కారం లభించింది. ఆయన 17 ఏళ్ల సైన్యంలో సేవలందించడంతో పాటు వివేకానంద సంస్థ ద్వారా సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ఆయన సేవలను గుర్తించి సంస్థ వ్యవస్థాపకుడు రామకృష్ణారెడ్డి స్ఫూర్తి పురస్కారం అందజేశారు. మంగళవారం రాజుపాలెంలో వెంకటరమణారెడ్డిని సత్కరించి ప్రశంసా పత్రం, జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో సంస్థ గౌరవ సలహాదారు శ్రీధర్‌రెడ్డి, ప్రతినిధులు పాల్గొన్నారు.

చిన్నారి చికిత్సకు ఆర్థిక సాయం

జమ్మలమడుగు, న్యూస్‌టుడే : స్థానిక మిరాయిగిరి వీధికి చెందిన హాజీ, అఫ్రోజ్ దంపతుల కుమారుడు మహమ్మద్ అయాన్ ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతుండగా వారికి ఆపన్న హస్తం అందించారు. పతంగే రామన్నరావు శతాబ్ది ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థుల 'మన పీపుల్ హైస్కూల్ సొసైటీ ఫౌండేషన్' సభ్యుల ద్వారా రూ.67 వేల నగదును చిన్నారి అమ్మమ్మ కరిమున్‌కు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో ప్రముఖులు పఠాన్ ఖాజా షరీఫ్, కోవెలకుంట్ల ఖాజా మొహిద్దీన్, మజహర్ అలీ, వేల్పుల శ్రీనివాసుల యాదవ్, అనంతగిరి నరసింహులు, శ్రీనాథ్, రాముడు, మహమ్మద్ రఫీ పాల్గొన్నారు.



కరిమున్‌కు నగదు అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

మేమున్నాం... మీకు తోడుగా...

(10 AM to 1 PM)
ప్రొద్దుటూరు : 9966349431
జమ్మలమడుగు : 9000409516
మైదుకూరు : 8008573447
బద్వేలు గ్రామీణ : 8008573493

?: ఖాజీపేట తహసీల్దారు కార్యాలయం ఎదురుగా శ్రీనివాసనగర్ వద్ద రహదారిపై తాగునీటి పైపులైనుకు లీకేజీ కారణంగా నీరు కలుషితమవుతోంది. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలి. - శ్రీనివాసులు, ఖాజీపేట

✓: తాగునీటి పైపులైనుకు లీకేజీని గుర్తించి మరమ్మతులు చేయిస్తాం. - రమణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి, ఖాజీపేట - న్యూస్‌టుడే, ఖాజీపేట

?: బ్రహ్మంగారిమఠంలోని గోవిందమాంబ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, స్థానిక ఆయుర్వేద హాలు సమీపంలోని రోడ్డులో చెత్త పేరుకుపోయి రోడ్డుపైకి వస్తోంది. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి. - సత్యనారాయణ, స్థానికుడు

✓: రహదారిపై చెత్త తొలగించేలా చర్యలు తీసుకుంటాం. పారిశుద్ధ్య పరిరక్షణకు కృషి చేస్తాం. - పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్‌రావు

?: బ్రహ్మంగారిమఠంలోని వివేకానందనగర్, బాలయ్యనగర్‌లో పది రోజులుగా తాగునీరు సక్రమంగా సరఫరా కావడం లేదు. - కలీమ్, స్థానికుడు

✓: తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం. - సుదర్శన్‌రెడ్డి, సర్పంచి - న్యూస్‌టుడే, బి.మఠం

ఖాదరాబాదు... సమస్యలతో బేజారు



జాతీయ రహదారి పక్కన వ్యర్థాలతో అపరిశుభ్రత

ప్రొద్దుటూరు గ్రామీణ, న్యూస్‌టుడే : మండల పరిధిలోని కొత్తపల్లె పంచాయతీ కొత్త ఖాదరాబాదులో కనీస వసతుల్లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు ఈ ప్రాంత అభివృద్ధిని పట్టించుకోకపోవడంతో అవస్థలు తప్పడం లేదు. జాతీయ రహదారి పక్కన ప్రధాన కాలువల్లో మురుగు తొలగించకపోవడంతో వ్యర్థాలు, పూడిక, జమ్ము, పిచ్చి మొక్కలతో దుర్వాసన, దోమలతో సతమతమవుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్తపల్లె-1 సచివాలయ పరిధిలోని ఖాదరాబాదులో 4,771 మంది జనాభా ఉండగా 1,210 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. మైలవరం జలాశయం ఏర్పాటుతో ఇళ్లు కోల్పోయిన బాధితులు అప్పట్లో ఇక్కడ స్థిరపడ్డారు.

విద్యకు గ్రహణం

ఖాదరాబాదులోని ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలకు నాలుగు గదుల్లో 1 నుంచి 8వ తరగతులు బోధిస్తున్నారు. గదుల కొరత కారణంగా 9, 10 తరగతుల నిర్వహణకు వీలు లేకుండా పోయింది. ముఖ్యంగా బాలికల విద్యకు విఘాతం కలుగుతోంది. పురపాలక పరిధి జిన్నారోడ్డులోని ఉర్దూ ఉన్నత పాఠశాలలకు వ్యయ ప్రయాసలతో వెళ్లాల్సి వస్తోందని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

❖ ఖాదరాబాదులోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 1 నుంచి 10వ తరగతి వరకు విద్యాబోధన కొనసాగుతోంది. విశాలమైన మైదానంలో వాననీరు వెళ్లేందుకు మార్గాలు లేక లోతట్టులో నిలిచిన మడుగులు, చిత్తడి, గడ్డి సమస్యగా మారింది. దీంతో ఆటలు, వ్యాయామం లేక విద్యార్థులు నష్టపోతున్నారు. పాఠశాల ప్రధాన మార్గంలో ఎర్రమట్టి ఉన్నందున వాననీటిలో పిల్లలు జారికిందపడిపోతున్నారు.

మురుగుపారుదలకు ఇబ్బంది

❖ కొత్త ఖాదరాబాదులో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణాలకు చర్యలు తీసుకోవడం లేదు. దీంతో మెరుగైన సౌకర్యాలు కల్పించాలన్న స్థానికుల డిమాండు అమలు కావడం లేదు. సీసీ రోడ్లపై ర్యాంపుల కారణంగా చోదకులు తరచూ ప్రమాదాల బారినపడుతున్నారు. వీధుల్లో పాత కాలువలు దెబ్బతిన్న చోట్ల మురుగుపారుదల అధ్వానంగా మారింది.


సమస్యల పరిష్కారానికి చర్యలు

ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలకు గదుల కొరత, జడ్పీ ఉన్నత పాఠశాలలోని క్రీడా మైదానాన్ని బాగు చేసేందుకు విద్యాశాఖ అధికారుల సమన్వయంతో పరిష్కారానికి కృషి చేస్తాం. జాతీయ రహదారి పక్కన కాలువల్లో స్వచ్ఛత పనులకు ప్రాధాన్యమిస్తాం. నిధుల లభ్యత దృష్ట్యా సీసీ రోడ్లు, కాలువలు, తాగునీటి గొట్టాల ఏర్పాటు పనులు చేపడతాం.

- సూర్యనారాయణ రెడ్డి, ఎంపీడీవో, ప్రొద్దుటూరు


భూ సమస్యల పరిష్కారానికి చర్యలు

కొండాపురం, న్యూస్‌టుడే : భూ సమస్యల పరిష్కారానికి గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు గురప్ప మంగళవారం తెలిపారు. మండలంలో గతంలో రీసర్వే జరిగిన గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. సంకేపల్లెలో నిర్వహించిన గ్రామసభలో రైతుల నుంచి వినతులు స్వీకరించారు. రీ సర్వే భూ సమస్యలపై సుమారు 25 మంది రైతులు అర్జీలు అందించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ మహేశ్వర్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



తహసీల్దారు గురప్పకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

సీఎం చంద్రబాబుతో లింగారెడ్డి భేటీ



సీఎం చంద్రబాబుతో మాట్లాడుతున్న లింగారెడ్డి

ప్రొద్దుటూరు వైద్యం, న్యూస్‌టుడే : సీఎం చంద్రబాబునాయుడును తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లెల లింగారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. సచివాలయంలో మంగళవారం రాత్రి ఆయనతో భేటీ అయ్యారు. జిల్లా, ప్రొద్దుటూరు నియోజకవర్గం పరిధిలోని పలు విషయాలను సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు లింగారెడ్డి తెలిపారు.

బడుగుల ఆశాజ్యోతి శంకరన్

బద్వేలు గ్రామీణ, న్యూస్‌టుడే : బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి ఎస్‌ఆర్ శంకరన్ అని బద్వేలు ఆర్డీవో చంద్రమోహన్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఎస్‌ఆర్ శంకరన్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా శంకరన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అంబేడ్కర్ ఆశయ సాధకుడు ఎంతో కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో దళిత సంఘం నాయకులు, ఆర్డీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఎస్‌ఆర్ శంకరన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్డీవో చంద్రమోహన్, దళిత సంఘాల నాయకులు

తెదేపా సభ్యత్వ నమోదుపై శిక్షణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి పక్కన నాయకులు

ప్రొద్దుటూరు వైద్యం, న్యూస్‌టుడే : తెదేపా క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం నాలుగు రోజుల్లో ప్రారంభమవుతుందని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం సభ్యత్వ నమోదుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సభ్యత్వం తీసుకున్న వారికి రూ.5 లక్షల బీమాతో పాటు వారి కుటుంబానికి విద్య, వైద్య సహాయం అందించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు పాల్గొని సభ్యత్వం నమోదు చేయించాలన్నారు. కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సురేష్‌నాయుడు, ముక్తియార్, మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, నాయకులు ఆసం రఘురామిరెడ్డి, ఈవీ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

యూటీఎఫ్ జిల్లా కార్యవర్గంలో మైదుకూరు ఉపాధ్యాయులు

మైదుకూరు, న్యూస్‌టుడే : ఉపాధ్యాయ ఐక్య వేదిక (యూటీఎఫ్) జిల్లా కార్యవర్గంలో మైదుకూరు నియోజకవర్గంలోని ఉపాధ్యాయులకు చోటు దక్కింది. ఆదివారం కడపలో జరిగిన సమాఖ్య స్వర్ణోత్సవ మహాసభలో సహ అధ్యక్షునిగా వనిపెంట పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు వై.రవికుమార్, జిల్లా కార్యదర్శిగా మైదుకూరు బాలికల ఉన్నత పాఠశాలలో ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయురాలు బోడెద్దుల లక్ష్మీప్రసన్న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సీపీఎస్ జిల్లా కన్వీనర్లుగా వనిపెంట, లక్ష్మీపేట పాఠశాల ఉపాధ్యాయులు ఎస్.అనిల్‌కుమార్, పి.శివకృష్ణను ఎన్నుకున్నారు.



రవికుమార్



లక్ష్మీప్రసన్న

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఆర్టీపీపీ విద్యార్థులు

ఎర్రగుంట్ల, న్యూస్‌టుడే : రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఆర్టీపీపీ డీఏవీ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు మంగళవారం ప్రిన్సిపల్ శ్రీనివాసగుప్త తెలిపారు. ఈ నెల 21న సీకేదిన్నె మండలం బయనపల్లిలోని ఎస్సీ ఉన్నత పాఠశాలలో జరిగిన ఎస్‌జీఎఫ్ ఖోఖో ఎంపికల్లో డీఏవీ పాఠశాలకు చెందిన హరిత, గీత, లోహిత, యోగ, రాఘవ, యతీష్, అమృత, సుశాంత్, వికాస్ ఎంపికైనట్లు వివరించారు. ఎంపికైన విద్యార్థులు ఈ నెల 25, 26, 27 తేదీలలో కాకినాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు. వ్యాయామ ఉపాధ్యాయులు నరేష్, విద్యార్థులను ఆర్టీపీపీ సీఈ గౌరీపతి, ఆర్టీ శేషారెడ్డి అభినందించారు.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపల్ శ్రీనివాసగుప్త, వ్యాయామోపాధ్యాయుడు నరేశ్

రైతులకు వేరుసెనగ విత్తనాల పంపిణీ

మైదుకూరు, న్యూస్‌టుడే : వనిపెంట కేవీకే ద్వారా కమలాపురానికి చెందిన అయిదుగురు రైతులకు వేరుసెనగ విత్తనాలు మంగళవారం అందజేశారు. కదిరి లేపాక్షి (కె-1812), నిత్యహరిత (టీసీజీఎస్-1157) రకాలను రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా కేవీకే సీనియర్ శాస్త్రవేత్త బాలకృష్ణ మాట్లాడుతూ.. వేరుసెనగను ఆశించే చీడపీడలు, నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. విత్తనశుద్ధి ఆవశ్యకతను వివరించారు.



రైతులకు వేరుసెనగ విత్తనాలు అందజేస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

ఉపాధిహామీ పనుల్లో అక్రమాలపై ఆగ్రహం



వివరాలు తెలుసుకుంటున్న డ్వామా ఏపీడీ నాగరత్నమ్మ

జమ్మలమడుగు గ్రామీణ, న్యూస్‌టుడే : ఉపాధి హామీ పనుల్లో ఉద్యోగులకు జాబ్‌కార్డులు మంజూరు చేసి, పనులు చేసినట్లు సృష్టించి అవినీతికి పాల్పడిన ఉపాధి సిబ్బందిపై డ్వామా ఏపీడీ నాగరత్నమ్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలో 15 రోజుల పాటు ఆయా గ్రామాల్లో 2023-24 సంవత్సరానికి సంబంధించి నిర్వహించిన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. చివరగా మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ప్రజావేదిక నిర్వహించి వివరాలు వెల్లడించారు. మండల పరిధిలోని పి.బొమ్మేపల్లె పంచాయతీలో నిర్వహించిన ఉపాధి పనుల్లో నెలకు రూ.20 వేలకు పైగా వేతనాలు పొందుతూ పలు సంస్థల్లో పని చేస్తున్న ఉద్యోగులు, మృతిచెందిన వ్యక్తుల పేర్లపై జాబ్‌కార్డులు మంజూరు చేసి అవినీతికి పాల్పడినట్లు తనిఖీల్లో బయటపడినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి పది రోజుల్లో విచారణ చేపట్టి నివేదిక అందించాలని ఎంపీడీవోను ఆదేశించారు. ఉపాధి పనుల్లో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల వారీగా ఆయా పనుల వివరాలను ఎస్‌ఆర్‌పీలు వివరించారు. కార్యక్రమంలో ఏపీవో పద్మారాణి, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

డిప్యూటీ డీఈవోపై చర్యలకు డిమాండు



డిప్యూటీ డీఈవో కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సంఘాల నాయకులు

ప్రొద్దుటూరు విద్య, న్యూస్‌టుడే : ప్రొద్దుటూరు డిప్యూటీ డీఈవో క్రిష్టప్పపై చర్యలు తీసుకోవాలని డిమాండు చేస్తూ ప్రగతిశీల విద్యార్థి యువజన సమైక్య రాష్ట్ర కన్వీనర్ ఓబులేసు ఆధ్వర్యంలో డిప్యూటీ డీఈవో కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన చేశారు. ఈ సందర్భంగా ఓబులేసు మాట్లాడుతూ.. డిప్యూటీ డీఈవో విధులకు సక్రమంగా హాజరుకావడం లేదన్నారు. ఉపాధ్యాయులు తమ పనుల నిమిత్తం కార్యాలయానికి వస్తున్నారని, అధికారి అందుబాటులో లేకపోవడంతో అసహనం వ్యక్తం చేస్తున్నారన్నారు. పులివెందుల మండలంలో ఓ ప్రధానోపాధ్యాయుడు నకిలీ ధ్రువపత్రాలతో ఉద్యోగం పొందారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఆయన అవినీతిపై విచారణ చేయించాలని కోరారు. ఆందోళనలో పలు సంఘాల నాయకులు బయన్న, శ్రీను, చెన్నమ్మ మాదిగ, గడ్డం నరసింహులు మాదిగ, ప్రతాప్‌రెడ్డి, శివశంకర్, రమణయ్య, భాస్కర్, సామేలు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

ప్రొద్దుటూరు, న్యూస్‌టుడే : ప్రొద్దుటూరు వైఎంఆర్ కాలనీ అరబిందో ఇంటిగ్రల్ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయురాలు జ్యోతిర్మయి తెలిపారు. నవంబర్ 11న కాకినాడలో జరిగే ఎస్‌జీఎఫ్ అండర్-14 రోలర్ స్కేటింగ్ రాష్ట్రస్థాయి పోటీల్లో సతీష్‌రెడ్డి, ఈ నెల 28న రాజమండ్రిలో జరిగే అండర్-14 ఎస్‌జీఎఫ్ బ్యాడ్మింటన్ పోటీలకు ప్రద్యుమ్నరెడ్డి, వెంకటగిరిరెడ్డి ఎంపికయ్యారని తెలిపారు. అక్కడ కూడా ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవ్వాలని పాఠశాల ప్రెసిడెంట్ వంకదార వీరభద్రయ్య, కరస్పాండెంట్ కాశిప్రసాద్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయుడు సాయి విద్యార్థులను అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్, పీఈటీ

కత్తెరపురుగు నివారణకు చర్యలు

కొండాపురం, న్యూస్‌టుడే : జొన్నపంట సాగులో కత్తెర పురుగు ఉద్ధృతి అధికంగా ఉన్నట్లు గుర్తించామని మండల వ్యవసాయాధికారి రామాంజుల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా కోడూరు, కొత్తపల్లి రైతు సేవా కేంద్రాల పరిధిలోని జొన్న పంటను ఆయన పరిశీలించారు. పంటలో అధికంగా కత్తెర పురుగు ఉన్నట్లు గుర్తించామన్నారు. పురుగు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మందులను సూచించారు. శనగపంటలో యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు.



జొన్నపంటను పరిశీలిస్తున్న ఏవో రామాంజుల్‌రెడ్డి, అధికారులు

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం స్వాధీనం

ప్రొద్దుటూరు గ్రామీణ, న్యూస్‌టుడే : స్థానిక రైస్‌మిల్లు రోడ్డులోని ఓ ఇంట్లో నిల్వ చేసేందుకు వాహనంలో తరలిస్తున్న 12 రేషన్ బియ్యం బస్తాలను మంగళవారం రాత్రి పౌరసరఫరాల డీటీ మల్లికార్జున, వీఆర్వో విష్ణు స్వాధీనం చేసుకున్నారు. వాహనాన్ని రెండో పోలీసు ఠాణాకు తరలించారు. వాహన డ్రైవర్‌తో పాటు బియ్యం ఎక్కడి నుంచి తీసుకొచ్చారో విచారించి బాధ్యులపై కేసు నమోదు చేస్తామన్నారు.

యూటీఎఫ్ నాయకులకు అభినందనల వెల్లువ

జమ్మలమడుగు, న్యూస్‌టుడే : జమ్మలమడుగు డివిజన్ నుంచి పలువురు యూటీఎఫ్ జిల్లా కమిటీకి ఎన్నికవడంపై స్థానిక నాయకులు మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. ఈ నెల 20న కడప యూటీఎఫ్ భవనంలో నిర్వహించిన జిల్లా స్వర్ణోత్సవ మహాసభలో కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీలో యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడిగా నాగార్జున రెడ్డి, జిల్లా కార్యదర్శిగా మురళీకృష్ణ, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యుడిగా రవిశంకర్, సీపీఎస్ కమిటీ సభ్యుడిగా మునిశేఖర్ ఎన్నికవడంతో డివిజన్ యూటీఎఫ్ నాయకులు లోకేశ్వర్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, ఓబులేసు, కంబగిరి, శివశంకర్‌రెడ్డి, మహమ్మద్ రఫీ తదితరులు అభినందించారు.

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని నిరసన

బద్వేలు గ్రామీణ, న్యూస్‌టుడే : మానవ మృగం చేతిలో మృతి చెందిన విద్యార్థిని కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని, నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు, విద్యార్థులు మంగళవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు శివశంకర్, అనిల్ మాట్లాడుతూ బాధిత కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండు చేశారు. బద్వేలు ప్రాంతంలో రెండేళ్లుగా విద్యార్థినులపై దాడులు పెరిగిపోయాయని, పోలీసులు బాలికలకు ధైర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జమ్మలమడుగు : బద్వేలు పట్టణంలో ఇంటర్ విద్యార్థిని దారుణంగా హత్య చేసిన నిందితుడు విఘ్నేష్‌ను కఠినంగా శిక్షించాలని జమ్మలమడుగు నూరుబాషా దూదేకుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పీరయ్య డిమాండు చేశారు. మంగళవారం రాత్రి స్థానిక పాత బస్టాండ్‌లోని గాంధీ కూడలిలో కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన చేశారు. నాయకులు చిన్నపీరయ్య, కుళ్లాయిస్వామి, అశోక్ ఆర్యన్, దస్తగిరి, బెల్లంకొండ, కిరణ్, సునీల్, తదితరులు పాల్గొన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి

బి.కోడూరు న్యూస్‌టుడే : మండల పరిధిలోని కస్తూర్బా బాలికల విద్యాలయంలో వివేకానంద ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం వ్యక్తిత్వ వికాస సదస్సు నిర్వహించారు. సంస్థ వ్యవస్థాపకుడు రామక్రిష్టారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం తొమ్మిది, పది, ఇంటర్ విద్యార్థినులకు 'నైతిక విలువలు-తల్లిదండ్రుల ప్రాముఖ్యత' పై పరీక్ష నిర్వహించారు. విజేతలకు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు ఆర్.రాజు, శ్రీధర్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, జయరామ్, ఎస్‌వో శ్రీలత, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ కోటాలో ఎంబీబీఎస్ సీటు



పోరుమామిళ్ల : తిరుపతి శ్రీవెంకటేశ్వర వైద్య కళాశాలలో ఎంబీబీఎస్‌లో ఎన్‌సీసీ కేటగిరి కింద పోరుమామిళ్ల మండలం మార్కాపురం గ్రామానికి చెందిన **కొమ్మలపాటి బెన్నుకు** సీటు వచ్చిందని తల్లిదండ్రులు సత్యప్రకాష్, విజయ తెలిపారు. బెన్ను చిత్తూరు జిల్లాలోని కలికిరి సైనిక పాఠశాలలో ఆరు నుంచి ఇంటర్ వరకూ చదివాడు. కుమారుడికి ఎంబీబీఎస్ సీటు రావడంపై తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో రోగాలు దూరం

దువ్వూరు, న్యూస్‌టుడే : ప్రతి విద్యార్థి వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే రోగాలు దరి చేరవని మండల వైద్యాధికారిణి వికసిత సూచించారు. మండల పరిధి పుల్లారెడ్డిపేట బీసీ వసతి గృహంలో మంగళవారం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం వసతిగృహంలోని వంటగది, మరుగుదొడ్లు పరిశీలించారు. కాలానుగుణ వ్యాధులు, పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వో శ్రావణి, హారతి పాల్గొన్నారు.

భర్త దాడిలో తీవ్ర గాయాలు

పోరుమామిళ్ల, న్యూస్‌టుడే : పట్టణంలోని మహబూబ్‌నగర్ కాలనీకి చెందిన వనపర్తి అంజలిపై ఆమె భర్త కత్తితో దాడి చేశాడని ఏఎస్సై బీఎన్ మూర్తి తెలిపారు. వనపర్తి అంజలికి 14 ఏళ్ల కిందట మహబూబ్‌నగర్ కాలనీకి చెందిన నారాయణతో వివాహమైంది. నారాయణ మూడేళ్లుగా మద్యానికి బానిసయ్యాడు. నిత్యం భార్యతో గొడవపడేవాడు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి కత్తితో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన అంజలిని కుటుంబ సభ్యులు పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. నారాయణపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ఆధార్ శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి

ఖాజీపేట, న్యూస్‌టుడే : మండల పరిధిలో ఏర్పాటు చేసిన ఉచిత ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని మండల పరిషత్ అధికారి దివిజ సూచించారు. మంగళవారం ఖాజీపేట-2 సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ క్యాంపును ఆమె సందర్శించి ఆధార్ నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 23న అప్పనపల్లి, నాగసానిపల్లె, 24న పత్తూరు, 25న తవ్వారుపల్లి సచివాలయాల్లో ఆధార్ క్యాంపులు నిర్వహిస్తామన్నారు.

ద్విచక్రవాహనం ఢీకొని పాదచారికి..

ఎర్రగుంట్ల, న్యూస్‌టుడే : కడప రోడ్డులోని ఓ పెట్రోల్ బంకు సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. చిత్తూరు జిల్లా విజయపురం మండలం జంబాడ గ్రామానికి చెందిన నల్లపోగు బాలాజీ రోడ్డు దాటుతుండగా ఎదురుగా వచ్చిన ద్విచక్రవాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాలాజీని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వసతుల్లేక... అవస్థలు తప్పక



అధ్వానంగా మహబూబ్‌నగర్ నుంచి గాంధీనగర్‌కు వెళ్లే వీధి

మైదుకూరు, న్యూస్‌టుడే : మైదుకూరు పురపాలకలో కాలనీల రూపురేఖలు మారడం లేదు. ఏళ్ల తరబడి అభివృద్ధికి నోచుకోకపోవడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. క్రమం తప్పకుండా పన్నులు వసూలు చేస్తున్న అధికారులు అభివృద్ధిని విస్మరించారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత వైకాపా పాలనలో పురపాలకలో మురుగునీటి కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణానికి పనులు ప్రారంభించినా సకాలంలో నిధులు విడుదల చేయకపోవడంతో అసంపూర్తిగా నిలిచిపోయాయి. పట్టణంలోని బీపీ చిన్న వెంకటసుబ్బయ్య నగర్, మహబూబ్‌నగర్, గాంధీనగర్, వాసవీనగర్ ప్రాంతాల్లో సమస్యలు తాండవిస్తున్నాయి. బీపీ చిన్న వెంకటసుబ్బయ్య నగర్‌లో మురుగుకాలువ లేకపోవడంతో ప్రైవేటు పాఠశాల వద్ద పెద్దఎత్తున వాననీరు నిలుస్తోంది. మహబూబ్‌నగర్ ప్రధాన వీధి చివరి ప్రాంతంలో దారి అధ్వాన్నంగా మారింది. వర్షమొస్తే రాకపోకలకు ఇబ్బందిగా మారింది. గతంలో రూ.2 లక్షలతో నిర్మించిన మురుగు కాలువ ధ్వంసమైంది. మాబునగర్ నుంచి గాంధీనగర్, రేణుకా ఎల్లమ్మ వీధికి వెళ్లే దారులు అభివృద్ధికి నోచుకోలేదు. వీధులు బురదరోడ్లను తలపిస్తున్నాయి. భారీ వర్షమొస్తే గాంధీనగర్‌లోని మురుగుకాలువలు పొంగి వీధుల్లోకి చేరుతున్నాయి. గాంధీనగర్ ప్రధానవీధి నుంచి అంతర్గత వీధులకు కొన్ని చోట్ల కల్వర్టులు లేకపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. వాసవీనగర్ నుంచి రేణుకాఎల్లమ్మ వీధికి వెళ్లే దారిలో స్థానికులు చెత్తాచెదారం వేస్తుండటంతో పరిసరాలు అధ్వానంగా మారాయి. ఎన్డీయే ప్రభుత్వంలోనైనా కాలనీల రూపురేఖలు మారతాయని కాలనీవాసులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై కమిషనర్ శ్రీనివాసులరెడ్డిని వివరణ కోరగా.. ఇంజినీరింగ్ అధికారితో కలిసి పరిశీలిస్తానన్నారు. ప్రజాప్రతినిధులతో చర్చించి 15వ ఆర్థిక సంఘం రెండోవిడత నిధులు కేటాయించి కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

అడుగేస్తే జారి పడాల్సిందే

మాబునగర్ మెయిన్‌రోడ్డు చివరిలో దాదాపు 300 మీటర్ల మేర సీసీ రోడ్డు లేదు. దీంతో వర్షమొస్తే ఈ ప్రాంతం బురదమయమవుతోంది. జాగ్రత్తగా అడుగు వేయకపోతే జారిపడాల్సిందే. మాబునగర్ వీధి నుంచి గాంధీనగర్, రేణుకాఎల్లమ్మ వీధిని అభివృద్ధి చేస్తే ప్రజలకు సౌకర్యంగా ఉంటుంది.

- బీపీ సుబ్బయ్య, మాబునగర్, మైదుకూరు

ప్రభుత్వాసుపత్రిలో పాము కలకలం

జమ్మలమడుగు గ్రామీణ, : మండల పరిధి మోరగుడి శివారులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోకి సోమవారం సాయంత్రం పాము ప్రవేశించడంతో సిబ్బంది భయంతో పరుగులు తీశారు. గంటల తరబడి ఆసుపత్రిలో పాము సంచరిస్తూ కలకలం సృష్టించింది. కొంతసేపటి తర్వాత పాము వెళ్లిపోవడంతో సిబ్బంది ఊపిరిపీల్చుకున్నారు. ఆసుపత్రి బయట విద్యుత్తు దీపాలు వెలగకపోవడంతో కొన్ని రోజులుగా అంధకారం నెలకొందని వైద్యాధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోగులు కూడా చీకటి పడితే వైద్యశాలకు రాలేని పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. అధికారులు స్పందించి ఆసుపత్రి ఆవరణలో పిచ్చి మొక్కలు తొలగించి, దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ఆసుపత్రిలో సంచరిస్తున్న పాము

కడప

• కడప • పులివెందుల • కమలాపురం

వాటర్‌గ్రిడ్ పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న నాబార్డు బృందం సభ్యులు

లింగాల, న్యూస్‌టుడే : పార్నపల్లె కోనమల్లేశ్వర ఆలయం సమీపంలో రూ.374 కోట్ల వ్యయంతో చేపట్టిన వాటర్ గ్రిడ్ పనులను నాబార్డు జీఎం పహాడిసింగ్‌తో పాటు అసిస్టెంటు జనరల్ విజయవిహారి, బృందం సభ్యుడు ప్రభాకరరావు మంగళవారం పరిశీలించారు. నియోజకవర్గ పరిధిలో 299 పంచాయతీలకు 2025 మార్చి నాటికి పనులు పూర్తి చేసి శుద్ధి నీరు ఇవ్వాలనే లక్ష్యంతో ప్రారంభమైన పనులు ఎంతమేర వచ్చాయని పరిశీలించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌ఛార్జి ఎస్ఈ ఏడుకొండలు , ఈఈ విజయభాస్కర్ పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి

వేంపల్లె, న్యూస్‌టుడే : మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీని వెంటనే అమలు చేయాలని మాజీ ఎంపీ, కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసి రెడ్డి కోరారు. మంగళవారం వేంపల్లె ఆర్టీసీ బస్టాండు వద్ద కాంగ్రెస్ నేతలతో కలిసి పోస్టుకార్డు ఉద్యమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడుస్తున్నా హామీలు అమలు చేయలేదని ఆరోపించారు. ధ్రువకుమార్‌రెడ్డి, సుబ్రమణ్యం, రామక్రిష్ణ, ఉత్తన్న పాల్గొన్నారు.


ఆర్టీసీ బస్సులో కూర్చుని నినాదాలు చేస్తున్న తులసిరెడ్డి

మేమున్నాం... మీకు తోడుగా...

(10 AM to 1 PM)
కడప : 8008573428, 8688701384
పులివెందుల : 8008573466
కమలాపురం : 8008573475

స్పందనకు వందనం

● నగరంలో పలు సమస్యలపై 'ఈనాడు'లో ప్రచురితమైన కథనాలకు అధికారులు స్పందించారు. స్థానిక నాగరాజుపేటలోని తులశమ్మ ఆసుపత్రి నుంచి ఎన్టీఆర్ కూడలివైపు వెళ్లే మార్గంలో ప్రధాన రోడ్డుపైన చెత్తను నగరపాలక సిబ్బంది తొలగించారు.
● రాజారెడ్డి వీధిలోని డీసీసీ బ్యాంకు వెనుకవైపున ప్రధాన రోడ్డులో పేరుకుపోయిన వ్యర్థాలను సిబ్బంది తరలించారు.
● మారుతీనగర్‌లోని ప్రెస్‌క్లబ్ పక్క సందులో మురుగు కాలువలను పారిశుద్ధ్య సిబ్బంది శుభ్రం చేశారు.
● యర్రముక్కపల్లె చౌడమ్మ ఆలయం సమీపంలో విద్యుత్తు నియంత్రిక వద్ద ఉన్న చెత్త కుప్పలను ఎత్తివేశారు.
● ద్వారకానగర్‌లో రైతు బజార్‌కు వెళ్లే మార్గంలో ప్రధాన రోడ్డులో పడేసిన కుళ్లిన కూరగాయల వ్యర్థాలను నగరపాలక సిబ్బంది తొలగించారు. - న్యూస్‌టుడే, మారుతీనగర్
● కమలాపురం సొసైటీ కాలనీ నుంచి ఎల్లమ్మ గుడికి వెళ్లే మార్గంలో కంపచెట్లు, పిచ్చిమొక్కలు పెరిగాయని ఇటీవల 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి నగర పంచాయతీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలనరసింహులు స్పందించి, కార్మికులతో కంపచెట్లు, పిచ్చిమొక్కలు తొలగింపజేసి, శుభ్రం చేయించారు. సమస్యను పరిష్కరించారు. - న్యూస్‌టుడే, కమలాపురం

?: వెల్లటూరు ప్రధాన వీధి రోడ్డు నుంచి పెద్దమ్మ గుడికి వెళ్లే దారిలో మురుగు, చెత్త పేరుకుపోయాయి. - సుబ్బరాయుడు, స్థానికుడు
✔: పరిశీలించి తగు చర్యలు తీసుకొంటాం - భాస్కర్, పంచాయతీ కార్యదర్శి, వెల్లటూరు - న్యూస్‌టుడే, పెండ్లిమర్రి

ఆగిన విస్తరణ... రాకపోకలకు యాతన

- న్యూస్‌టుడే, నగరపాలక సంస్థ

కడప నగరంలోని రెండో గాంధీ బొమ్మ నుంచి బిల్టప్ కూడలికి వెళ్లే మార్గంలో రోడ్డు విస్తరణ పనులు పూర్తి కాకపోవడం వాహనచోదకులకు తీవ్ర సమస్యగా మారింది. 2007లో బిల్టప్ - రెండో గాంధీ బొమ్మ కూడలి రహదారి విస్తరణ పనులు మొదలుపెట్టారు. దీనిని 60 అడుగులకు విస్తరించాల్సి ఉంది. ప్రతిపాదిత లక్ష్యంలో 75 శాతం పనులు పూర్తిచేశారు. మరో 25 శాతం ఆగిపోయింది. రెండో గాంధీ బొమ్మ దాటిన తర్వాత రహదారికి ఇరువైపులా కొన్ని నిర్మాణాలను తొలగించలేదు. దీంతో ఆయా ప్రాంతాల్లో రోడ్డు వెడల్పు 25 అడుగులకే పరిమితమైంది. ఈ నేపథ్యంలో రెండు వైపుల నుంచి ఎదురెదురుగా వాహనాలు వస్తే ఎక్కడివక్కడ ఆగిపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

కీలక మార్గం : కడప నగరం నుంచి పులివెందుల వైపు వెళ్లే బస్సులన్నీ ఈ మార్గంలోనే వెళతాయి. హైదరాబాదు, విజయవాడ వెళ్లే ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు కూడా ఇటువైపు నుంచే బిల్టప్ కూడలిలోని రాయలసీమ ఎక్స్‌ప్రెస్ హైవేకు చేరతాయి. ఇలాంటి భారీ వాహనాలు ఇరుకైన ఈ రోడ్డులో రాకపోకలు సాగించేటప్పుడు పలు ప్రమాదాలు జరిగాయి. గత కమిషనర్ సూర్యసాయిప్రవీణ్‌చంద్ ఈ రోడ్డు విస్తరణకు సంబంధించిన సమస్యలను దాదాపుగా కొలిక్కి తీసుకొచ్చారు. ఆయన బదిలీ అనంతరం మళ్లీ మొదటికొచ్చింది. ఒకటో గాంధీ బొమ్మ నుంచి రెండో గాంధీ బొమ్మ, మేదరవీధి, మట్టిపెద్దపులి, చిలకలబావి వరకు 80 అడుగులకు విస్తరించాల్సిన రహదారిని అప్పటి ప్రజాప్రతినిధుల బెదిరింపులతో 65 అడుగులకు కుదించారు. దీని ప్రకారం నష్టపరిహారం చెల్లించి రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. కానీ వన్‌టౌన్ కూడలి నుంచి చెన్నూరు బస్టాండు వరకు 65 అడుగులు ఉండాల్సిన రోడ్డు సగటున 55 అడుగులకు చేరింది. 10 అడుగుల మేర ఆక్రమణలకు గురైంది. దీంతో అత్యంత రద్దీగా ఉండే ఈ మార్గంలో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారింది. రూ.కోట్లు ఖర్చు పెట్టి చేపట్టిన రోడ్డు విస్తరణ పనులను పూర్తి చేయకపోతే ప్రజాధనం వృథా అయినట్టేనని నగరవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం దీనిపై దృష్టిసారించి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.


ఇరుకుగా బిల్టప్ రోడ్డు

25న పాలిటెక్నిక్ కళాశాలలో ఉద్యోగ మేళా

కమలాపురం, న్యూస్‌టుడే : స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 25వ తేదీన ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

23న నగర పంచాయతీ సమావేశం

కమలాపురం, న్యూస్‌టుడే : స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో ఈ నెల 23న సాయంత్రం సాధారణ సమావేశం నిర్వహిస్తున్నామని నగర పంచాయతీ కమిషనర్ జగన్నాథ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సభ్యులు తప్పక హాజరుకావాలని కోరారు.

మహిళలకు రక్షణ కరవు

కమలాపురం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో నిత్యం మహిళలు, యువతులకు రక్షణ కరవైందని, వారిపై దాడులు జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వైకాపా జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ తెదేపా ప్రభుత్వంలో హత్యలు, అరాచకాలు, దౌర్జన్యాలు తప్ప అభివృద్ధి లేదని విమర్శించారు. త్వరలో జమిలి ఎన్నికలు వస్తే ప్రజలు మూకుమ్మడిగా తెదేపాను ఓడించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. నాయకులు చెన్నకేశవరెడ్డి, ఎంపీ సుబ్బారెడ్డి, శ్రీనివాసులరెడ్డి, హిదయతుల్లా, బాలగంగాధర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, శరత్‌బాబు, కొండారెడ్డి, జెట్టి నాగేశ్, జగన్‌మోహన్‌రెడ్డి, జిలానీ బాషా పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై మాక్‌డ్రిల్


ప్రదర్శన చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే : అగ్ని ప్రమాదాల నివారణపై ఆ శాఖ సిబ్బంది మంగళవారం కడప నగరం మరియాపురంలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయం వద్ద మాక్‌డ్రిల్ నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ఎలా స్పందించాలి, వాటి నుంచి ఎలా బయటపడాలి తదితర అంశాలపై సిబ్బంది అవగాహన కల్పించారు. అగ్నిమాపక జిల్లా సహాయ అధికారి బసివిరెడ్డి, ఏపీజీబీ ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రతిభ చూపారు... బహుమతి సాధించారు

కడప విద్య, న్యూస్‌టుడే : కడప నగరంలోని శ్రీసాయికృష్ణ ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాలలో మంగళవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పాటవ పరీక్ష నిర్వహించారు. 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలో మొదటి, రెండు, మూడు స్థానాల్లో వరుసగా ఎస్. అతిఫ్‌హుస్సేన్ (10వ తరగతి), ఆర్.ఎస్. దివ్యశ్రీ (9వ తరగతి), షేక్ ఖుతిజతుల్ కుబ్రా (7వ తరగతి) నిలిచారు. విజేతలకు పాఠశాల కరస్పాండెంట్ పి.సుశీల, వైస్‌ప్రిన్సిపల్ పి.శిరీష ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పోటీలు నిర్వహించడం అభినందనీయమని, దీని ద్వారా విద్యార్థుల్లో విషయపరిజ్ఞానం, సృజనాత్మకత పెంపొందుతాయని పేర్కొన్నారు.


ప్రతిభా పాటవ పరీక్ష రాస్తున్న విద్యార్థులు



విజేతలతో కరస్పాండెంట్ పి.సుశీల, వైస్‌ప్రిన్సిపల్ పి.శిరీష

ఉరుసు ఉత్సవాలకు మేయర్‌కు ఆహ్వానం

కడప, చిన్నచౌకు, న్యూస్‌టుడే: కడప పెద్దదర్గా ఉరుసు ఉత్సవాలకు హాజరు కావాలని మేయర్ సురేష్‌బాబుకు దర్గా పీఠాధిపతి ఆరిఫుల్లా హుస్సేనీ, దర్గా ప్రతినిధులు మంగళవారం ఆహ్వాన పత్రం అందజేశారు. నవంబరు 3 నుంచి దర్గా ఉత్సవాలు ప్రారంభమవుతాయని, 16న గంధం, 17న ఉరుసు, 18న ముషాయిరా ఉంటాయని పేర్కొన్నారు.

బధిరుల పాఠశాల పరిశీలన

కడప న్యాయవిభాగం, న్యూస్‌టుడే: కడప నగరంలోని బధిరుల ప్రత్యేక పాఠశాల, బాలుర వసతి గృహాన్ని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ జడ్జి ఎస్.బాబా ఫకృద్దీన్ మంగళవారం పరిశీలించారు. చెన్నూరు బస్టాండ్ సమీపంలో మానసిక వికలాంగుల ప్రత్యేక పాఠశాల, రాష్ట్రీయ సేవా సమితి వికాస్ విహార్, రిమ్స్‌లోని మానసిక వికలాంగుల పాఠశాల, రామంజనేయపురంలోని హెలెన్‌కెల్లర్ బధిరుల పాఠశాలలను జడ్జి పరిశీలించారు. సమస్యలు ఏమైనా ఉంటే తమ సంస్థ దృష్టికి తేవాలని సూచించారు.

సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడి మృతికి సంతాపం

వేముల, న్యూస్‌టుడే : వేల్పుల వ్యవసాయ సహకార పరపతి సంఘం మాజీ అధ్యక్షుడు భూమయ్యగారిపల్లెకు చెందిన ఎం.శివశంకర్‌రెడ్డి (45) మంగళవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. ఉదయం తోటలో అరటి గెలలు కోస్తుండగా ఒక్కసారిగా కిందపడిపోయారు. స్థానికులు ఆసుపత్రికి తీసుకెళుతుండగా మార్గంమధ్యలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎంపీ అవినాష్ రెడ్డి గ్రామానికి చేరుకుని శివశంకర్‌రెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.


శివశంకర్‌రెడ్డి (పాతచిత్రం)

విద్యార్థుల ప్రయోజనమే లక్ష్యంగా ప్రాజెక్టులు


సమావేశంలో పాల్గొన్న వీసీ, అధ్యాపకులు, తదితరులు

వైవీయూ (కడప), న్యూస్‌టుడే: విద్యార్థుల భవిష్యత్తు ప్రయోజనమే లక్ష్యంగా ప్రాజెక్టుల రూపకల్పన చేశామని యోగి వేమన విశ్వవిద్యాలయం బాధ్య వీసీ ఆచార్య కె.కృష్ణారెడ్డి పేర్కొన్నారు. 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ' కార్యక్రమంలో భాగంగా పలు ప్రాజెక్టుల ప్రతిపాదనల తయారీపై వీసీ, రిజిస్ట్రార్ పి.పద్మలు ఆచార్యులతో సమావేశమయ్యారు. ఆచార్య చంద్రఓబులరెడ్డి, డాక్టర్ టి.చంద్రశేఖర్, డాక్టర్ డీఆర్ సతీష్‌బాబు తయారుచేసిన ప్రతిపాదనలను ఉన్నత విద్యామండలికి పంపినట్లు వివరించారు. ఆచార్య ఏజీ దాము, ఐటీ సెల్ డైరెక్టర్ శివప్రతాప్, డీవోఏ డైరెక్టర్ లక్ష్మీప్రసాద్, సీడీసీ డీన్ రఘుబాబు, జయరాజు, సునీత, శ్రీనివాసరావు, శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాసగౌడ్, సుమిత్ర పాల్గొన్నారు.

మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి

కమలాపురం, న్యూస్‌టుడే : విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సీఐ రోశన్, ఎస్సై ప్రతాప్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో మదర్ థెరిస్సా సేవా సమితి ఆధ్వర్యంలో 'మాదకద్రవ్యాల నిర్మూలన' పై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ మత్తుతో భవిష్యత్తు నాశనమవుతుందని చెప్పారు. హోమియో ఆసుపత్రి వైద్యుడు షాకీర్‌హుస్సేన్, ప్రిన్సిపల్ డాక్టర్ వినోద్‌కుమార్, జూటూరు విజయ్‌కుమార్, డాక్టర్ కృష్ణ, ఎన్ఎస్ఎస్ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అవినీతి వీఆర్వోపై చర్యలకు వినతి

కడప : చక్రాయపేట మండలంలో అక్రమాలకు పాల్పడుతున్న ఓ వీఆర్వోపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు మంగళవారం బాధ్య కలెక్టర్ అదితిసింగ్‌కు ఫిర్యాదు చేశారు. కల్లూరుపల్లె వీఆర్వోగా విధులు నిర్వహిస్తూ, తన పలుకుబడితో 13 ఏళ్లుగా ఈ మండలంలోనే విధులు నిర్వహిస్తున్నారన్నారు. ఈ విషయమై విచారించి వీఆర్వోపై చర్యలు తీసుకోవాలని కోరారు.

సచివాలయంలో భయం... భయం


పెచ్చులూడిన పైకప్పు


కార్యాలయంలో ఉరుస్తున్న నీరు

కడప భాగ్యనగర్ కాలనీ, న్యూస్‌టుడే: పాత భవనం.. వర్షం వస్తే కారుతున్న శ్లాబ్, పెచ్చులూడుతున్న పై కప్పు... ఇది కడప నగరం సచివాలయం 20/1 పరిస్థితి. ఇక్కడ సిబ్బంది ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని విధులు నిర్వర్తించాల్సిన పరిస్థితి. ప్రగతిభవన్‌లో ఈ సచివాలయానికి కేటాయించిన గదిలో ఆదివారం రాత్రి పైకప్పు పెచ్చులూడి సరిగ్గా సిబ్బంది కూర్చునే కుర్చీ, బల్లమీదే పడింది. సెలవుదినం కావడంతో ప్రమాదం తప్పింది. ఆ గది శ్లాబ్ నుంచి నీరు కారుతోంది. మరో పక్క పడేందుకు సిద్ధంగా ఉంది. ఉన్నతాధికారులు స్పందించి పెనుప్రమాదం వాటిల్లకముందే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఉద్యోగులు విజ్ఞప్తి చేస్తున్నారు.

బిల్లుల బకాయిలు జగన్ పాపమే!

పులివెందుల (వేంపల్లె), న్యూస్‌టుడే : పులివెందుల పురపాలక పరిధిలో వీధి దీపాలు వెలగక పట్టణమంతా అంధకారంలో ఉందని, వీధి దీపాలకు సంబంధించి రూ.27 కోట్ల బకాయిలు ఉన్నాయని ఈ పాపం మాజీ సీఎం జగన్‌దేనని ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం ఆయన భాజపా జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డితో కలిసి మున్సిపల్ కార్యాలయానికి వెళ్లారు. రింగురోడ్డు, ఇతర ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగకపోవడంపై కమిషనర్ రాముడును ప్రశ్నించారు. సార్వత్రిక ఎన్నికల ఫలితాల ప్రకటన తర్వాత వీధిదీపాలు ఎందుకు వెలగడంలేదని ప్రశ్నించారు. తెదేపా కారణంగానే వీధి దీపాలు వెలగడం లేదని వైకాపా నాయకులు ఆరోపణలు చేస్తున్నారన్నారు. గత వైకాపా ప్రభుత్వంలో వీధి దీపాల ఏర్పాటులో పెద్దఎత్తున అవినీతి జరిగిందని విమర్శించారు. వారం రోజుల్లోగా సమస్యను పరిష్కరించాలని లేకపోతే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో భాజపా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు భానుప్రకాశ్, తెదేపా నాయకులు పాల్గొన్నారు.


కమిషనర్ రాముడితో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

యూటీఎఫ్ జిల్లా కార్యవర్గంలో వేంపల్లె వాసులకు చోటు

వేంపల్లె, న్యూస్‌టుడే : యూటీఎఫ్ జిల్లా కార్యవర్గంలో వేంపల్లె ఉపాధ్యాయులకు చోటు దక్కింది. వేంపల్లె జిల్లా పరిషత్ బాలికల కళాశాల తెలుగు అధ్యాపకుడు చేరుకూరు శ్రీనివాసులు జిల్లా కార్యదర్శిగా, పాములూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు కృష్ణారెడ్డి రాష్ట్ర కౌన్సిలర్‌గా, టీవీ రమణ జిల్లా ఆడిట్ కమిటీ సభ్యుడిగా చోటు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

అధికారుల నిర్లక్ష్యంతో ఆధార్ సేవల్లో జాప్యం

వేంపల్లె, న్యూస్‌టుడే : అధికారుల నిర్లక్ష్యంతో సకాలంలో ఆధార్ సేవలు అందడం లేదని భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్ పేర్కొన్నారు. ఈ విషయమై భాజపా నాయకులతో కలిసి ఎంపీడీవో కుళ్లాయమ్మకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేంపల్లె సచివాలయాల్లో కెమెరాలు, పరికరాలు పనిచేయకపోవడంతో ఆధార్‌లో మార్పులు, చేర్పుల కోసం పులివెందుల, కడపకు వెళుతున్నారని, ఈ సమస్యను త్వరగా పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు దొంతు సమన్, ఈశ్వర్‌రెడ్డి, సురేష్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

అరవిందనగర్(కడప), న్యూస్‌టుడే: కడప నగరంలోని ప్రతి సమస్యను పరిష్కరిస్తామని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, కడప ఎమ్మెల్యే మాధవి పేర్కొన్నారు. నగరంలోని సంజన్న కూడలి నుంచి మాచుపల్లె రోడ్డు వరకు నిర్మించిన నూతన రహదారిని మంగళవారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను కచ్చితంగా అమలు చేస్తామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దీపావళి కానుకగా మహిళా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని మూడు సిలిండర్లు ఉచితంగా ఇచ్చేందుకు నిర్ణయించారని చెప్పారు. రానున్న రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలు వస్తాయని తెలిపారు. పాలకొండ్రాయ దేవస్థానం ఛైర్మన్ రెడ్డెయ్య యాదవ్, వివేకానందరెడ్డి, ఉపాధ్యాయులు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.


రహదారిని ప్రారంభిస్తున్న తెదేపా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే మాధవి

చెత్త తొలగింపు

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే: నగరంలోని నకాష్ శ్మశాన వాటిక డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. ఎమ్మెల్యే మాధవి ఆదేశాల మేరకు తెదేపా నాయకుడు అబ్దుల్లా ఆధ్వర్యంలో మంగళవారం కాల్వలోని వ్యర్థాలను ఎత్తివేసి మురుగునీరు సాఫీగా వెళ్లేలా చర్యలు చేపట్టారు. కొన్ని నెలలుగా ఉన్న సమస్యను ఎమ్మెల్యే పరిష్కరించారని స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

అష్ఫాఖుల్లా ఖాన్‌కు నివాళి

మారుతీనగర్, న్యూస్‌టుడే: అసమానతలు లేని సమాజానికి, దేశ ఐక్యతకు ప్రాణాలను బలిచ్చిన అసమాన ధైర్యశాలి అష్ఫాఖుల్లాఖాన్ అని ఆప్ కీ అవాజ్ రాష్ట్ర కార్యదర్శి మక్బుల్‌బాషా, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ అన్నారు. మంగళవారం అష్ఫాఖుల్లా ఖాన్ జయంతిని పురస్కరించుకుని వారి జిల్లా కార్యాలయాల్లో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

ముగిసిన సర్టిఫికెట్ కోర్సు శిక్షణ

వైవీయూ (కడప), న్యూస్‌టుడే: కడప నగరంలోని కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గత నెల రోజుల నుంచి జరుగుతున్న డిజిటల్ లిటరసీ సర్టిఫికెట్ కోర్సులు మంగళవారం ముగిశాయి. విద్యార్థినులకు ప్రిన్సిపల్ వి.సలీంబాషా, కోఆర్డినేటర్ ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థినులు అకడమిక్ సబ్జెక్టులతో పాటు సర్టిఫికెట్ కోర్సులు చేయడం ద్వారా ఉద్యోగావకాశాలు మెరుగవుతాయన్నారు. అధ్యాపకులు గురుమోహన్‌రెడ్డి, విజయలక్ష్మి, శిక్షకులు పాల్గొన్నారు.

తప్పిన ప్రమాదం

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: ఒంటిమిట్టలో కడప-రేణిగుంట జాతీయ రహదారిపై మంగళవారం త్రుటిలో ప్రమాదం తప్పింది. మహారాష్ట్ర నుంచి తిరుపతికి వెళ్తున్న కంటైనరు స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల సమీపంలోకి రాగానే కడప నుంచి రాజంపేటకు వెళ్లే కారును ఢీకొట్టింది. కారును నడుపుతున్న చోదకుడు అప్రమత్తం కావడంతో డివైడర్, కాలిబాటపైకి వెళ్లి ఆగింది. అందులో ప్రయాణిస్తున్న సుగుణాకర్‌రెడ్డి, మధుసూదన్‌రావు సురక్షితంగా బయటపడ్డారని ఎస్.ఐ.శివప్రసాద్ తెలిపారు. ఘటనపై విచారణ చేస్తున్నామని వివరించారు.

చెస్ పోటీల్లో సత్తా

కమలాపురం, న్యూస్‌టుడే : ఈ నెల 21న కడపలో జరిగిన జిల్లా స్థాయి చదరంగం పోటీల్లో పెద్దచెప్పలిలోని జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇమ్రాన్, జాహ్నవి మొదటి స్థానం, ఆరిఫ్ రెండో స్థానంలో నిలిచారు. వీరిని హెచ్ఎం ఓబుల్‌రెడ్డి, పీడీ సునీల్, ఉపాధ్యాయులు అభినందించారు.

చదిపిరాళ్ల చెరువుకు జలకళ

మండలంలోని చదిపిరాళ్ల చెరువు జలకళ సంతరించుకుంది. ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్య రెడ్డి, తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డిల కృషితో ఇటీవల వీఎన్‌పల్లె మండలంలోని జీఎన్ఎస్ కాలువ నుంచి పాపఘ్ని నదికి నీటిని విడుదల చేశారు. అనంతరం మండలంలోని లేటపల్లె వద్ద నదిలో ప్రవాహానికి అడ్డుకట్టి వేయించి కట్టుకొమ్మకాలువ ద్వారా చదిపిరాళ్ల, కమలాపురం చెరువులకు నీటిని మళ్లించారు. మొదటగా చదిపిరాళ్ల చెరువు నిండి అలుగు పారడంతో ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేశారు. - న్యూస్‌టుడే, కమలాపురం



వల్లూరు... సమస్యలతో బేజారు!


గుంతలమయమైన మండల కాంప్లెక్సుకు వెళ్లేదారి

వల్లూరు, న్యూస్‌టుడే : వల్లూరు మండల కేంద్రంలో సమస్యలు తిష్ఠ వేశాయి. కనీస వసతుల్లేక అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచిపోయింది. వల్లూరులోని పడమర వీధి మినహా తూర్పువీధి, శివాలయంవీధి, హైస్కూలు వీధి, రజక వీధి, గాంధీకూడలి రహదారులు పూర్తిగా దెబ్బతిని గుంతలమయమయ్యాయి. గుంతల్లో నీరు నిలవడంతో వాహనదారులు ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదాల బారినపడుతున్నారు. కాలువలు లేకపోవడంతో మురుగు ఇళ్ల మధ్య నిలుస్తోంది. దీంతో దోమలు, దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గాంధీకూడలిలో ఏర్పడిన నీటి గుంతకు మరమ్మతులు చేయకపోవడంతో చిన్నపాటి చెరువును తలపిస్తోంది. చిన్న వర్షమొచ్చినా ఎస్సీ కాలనీలోని వీధులు జలమయమవుతున్నాయి. మండల కాంప్లెక్సుకు వెళ్లేదారిలో పిచ్చమ్మ సత్రం నుంచి కాంప్లెక్సు వరకు మట్టిరోడ్డు గుంతలతో నిండిపోయింది. ఈ మార్గంలో వెళ్లేందుకు వాహనదారులు అవస్థలు పడుతున్నారు. గత వైకాపా పాలకుల నిర్లక్ష్యం కారణంగా వల్లూరులో ఉద్యానవన నిర్మాణం మధ్యలోనే ఆగిపోయింది. ముళ్లపొదలతో నిండిపోయి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. గాంధీకూడలి నుంచి బస్టాండు, గణేష్‌పురం వరకు ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన వీధి దీపాలు సగానికి పైగా వెలగడం లేదు. దీంతో రాత్రి వేళల్లో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు స్పందిస్తూ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామన్నారు.


పశువులకు నిలయంగా ఉద్యానవనం